# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎన్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

జి.ఎన్.ఆర్. మూర్తి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 29 Issue 7

No.of Pages 40

MARCH 2010

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,

| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీఅభిభాషణ | 8 |
| సన్నిధిలోసంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 13 |
| సిరికింజెప్పడు.... | 14 |
| సత్సంగసౌరభం | 15 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 17 |
| గురుకృప | 20 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 22 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 24 |
| మాతాజీ బోధామృతం | 27 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 30 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 33 |
| సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

**ఉగాది శుభాకాంక్షలతో**

# భద్రవాక్యం

**నిత్యానందసుధానిధే రధిగతః సన్నీల మేఘః సతా**
**మౌత్కంఠ ప్రబల ప్రభంజన భరై రాకర్షితో వర్షతి**
**విజ్ఞానామృత మద్భుతమ్ నిజ వచో ధారాభి రారాదిదమ్**
**చేతశ్చాతక! చేన్నవాంఛషిత్ప షాక్రాన్తో z పి సుప్తో z సి కిం?**

- ప్రబోధ సుధాకరము

చాతక పక్షి మేఘం వర్షిస్తున్నప్పుడు ఆ జలాలను క్రింద పడకముందే నేరుగా త్రాగి దప్పిక తీర్చుకుంటుంది తప్ప గొంతు ఎండి చచ్చిపోతున్నా సరే వేరే నీటిని త్రాగదు. తమ మనస్సును చాతక పక్షితో, సచ్చిదానంద బ్రహ్మమును అమృత సాగరంతో, ఆ సుధాసాగరంలోని అమృతం ఆవిరి అయి ఏర్పడిన కాల మేఘాన్ని నీలమేఘశ్యాముడైన శ్రీ కృష్ణునితో, శ్రీ కృష్ణుని జ్ఞాన బోధామృత వర్షధారలను కాలమేఘం వర్షించే శుద్ధ జల ధారలతో పోలుస్తూ శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు ఇలా అంటున్నారు -

'నామనస్సనే ఓ చాతకమా! ఎంతకాలంనుంచో నీవు దాహంతో ఉండీ ఎండాకాలానికి నీ గొంతంతా ఎండిపోయి విపరీతమైన దప్పిక అవుతున్నా, సచ్చిదానంద సాగరంలోని అమృతం ఆవిరి అయి శ్రీకృష్ణుడనే కాలమేఘంగా మారి జ్ఞానార్థుల పిపాస అనే ప్రచండ వాయువు చేత ఆకర్షింపబడి వారి దగ్గరకు చేరి జ్ఞానసుధ అనే వర్షాన్ని కురిపిస్తున్నా నీవు దానిని గ్రోలకపోవటం చూస్తుంటే చాలా వింతగా ఉన్నది. ఇంకా నిన్ను నిద్ర వదలలేదా? అత్యంత దుర్లభమైన ఈ జ్ఞానామృతాన్ని గ్రోలే మహదవకాశాన్ని ఎందుకు చేజార్చుకుంటావు? అంత తామసం పనికిరాదు. లేచి ఆ అమృతాన్ని సేవించి ఆత్మానుభూతిని పొందు.'

శ్రీకృష్ణుడనే కాలమేఘం వర్షించిన అమృతధారలే భగవద్గీత. జన్మ కలిగినందుకు ఆ గీతామృత సారాన్ని గ్రోలటం తప్ప మన మనస్సనే చాతక పక్షి దప్పిక తీరటానికి, సంసార మలమోచనానికి , మోక్ష ప్రాప్తికి వేరే మార్గం లేదు అని శంకర భగవత్పాదాచార్యులవారు హెచ్చరిస్తున్నారు.

శంకర భగవత్పాదాచార్యులవారికి ఒకవేళ మనస్సు ఉన్నా అది కాలిపోయిన త్రాడువలె అయి, ఆకారానికి మాత్రం త్రాడుగా కనిపించినా, బంధించే శక్తిని కోల్పోయి ఉంటుంది. అటువంటి మనస్సుకు ఈ హెచ్చరిక అవసరమా? మరి ఈ హెచ్చరిక ఎవరికి అంటే మనకోసమే. *

# అమ్మ ఆశీస్సులు

**శంకరస్య చరితా కథామృతం చంద్రశేఖర గుణానుకీర్తనమ్ ।**
**నీలకంఠ తవ పాద సేవనమ్ సంభవంతు మమ జన్మ జన్మని ॥**

మహాశివరాత్రి పండుగ మనమందరమూ కన్నుల పండువుగా చేసికొన్నాము.

విరోధినామ సంవత్సరానికి వీడ్కోలు ఇస్తూ వికృతి నామ సంవత్సరానికి స్వాగతం పలుకబోతున్నాము. నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తే ఏ కష్టాలూ రావు అని శ్రీ గురుదేవులు సెలవిచ్చారు. మనము వాడుకభాషలో ప్రకృతి వికృతి అంటాము. ఎవరిదృష్టి అయితే ప్రకృతి ప్రభావానికి లొంగి విషయాదులవలలో పడుతుందో వాని జీనితము వికృతంగానే ఉంటుంది. మన జీవితంలోనే జీవిగా ప్రాణియై ప్రకాశిస్తున్నది ముందే కృతమై అమర్చబడిఉంది. శ్రీమహాలక్ష్మి అమ్మవారు తనని ఆరాధించుకొనుటకై ప్రసాదించిన నామములలో - ఓం ప్రకృత్యైనమః , ఓం వికృత్యైనమః, ఓంవిద్యాయైనమః, ఓంసర్వభూతహితప్రదాయైనమః, ఓం శ్రద్ధాయైనమః - ఈ అయిదు నామాలు చూస్తే మనం శ్రద్ధతో సర్వభూతముల హితమును కోరుతూ శ్రీ జగన్మాతను మనసార నమ్మిన వానికి లోటేముంటుంది? ప్రకృతి వికృతియే అని అనుభవించవచ్చు లేదా విశేషముగా భగవంతునితో కృతమైఉన్నది అని అనుభవించనూవచ్చు. ఈ కాలమంతా భగవన్మయమే అని ఆశ్రయించి ఆనందిస్తున్న సాధకునికి సాధ్యం కానిదేమున్నది?

డి.17 నుండి 23 వరకు జరుగబోయే మౌనధ్యాన సప్తాహ శిబిరంలో భక్తులు శ్రీ స్వామివారి సన్నిధిలో ధ్యాన సాధన చేస్తారు. ఆ మర్నాడు శ్రీరామనవమి. శివునకు, రామునకు భేదమేమున్నది? దర్శించేవారికి అనుభవించేవారికి వారి వారి మనస్సుకున్న భేదదృష్టిని తొలగించుకుంటే అంతా ఆనందమే కదా! శివః - మంగళస్వరూపుడు. రామః - ప్రకాశస్వరూపుడు.

శివునకు మాధవునకు ఇసుమంత భేదము లేదురా
శివ శివా నారాయణా మృత్యుంజయ మధుసూదనా ।

**శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః । యథాన్తరం న పశ్యామి తథామే స్వస్తిరాయుషి । యథాన్తరం నబోధాన్స్యుః శివకేశవయోస్తథా।**

-అని స్కందోపనిషత్తు బోధిస్తున్నది.

శివ చింతన తరువాత రామ చింతన చేసికొబోతున్నాము. 'తెలిసి రామచింతన తో నామము చేసిన' అన్నారు శ్రీ త్యాగరాజస్వామివారు. మీరందరూ నిరంతరమూ భగవన్నామంలో ఓలలాడుతూఉండాలి. అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, సాధనా సంపత్తిని, ఆత్మజ్ఞానమును గురుపాదుకలు ప్రసాదించుగాక! సుఖీభవ!

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీ సద్గురుదేవుల అనుగ్రహంతోఆశ్రమంలో శివరాత్రి ఎంతో భక్తిభరితంగా గడిచింది. తెల్లవారుజామున 3 గం॥లకే శ్రీ సద్గురుదేవులకు అభిషేకం, ఆ తరువాత శ్రీ సద్గురుదేవుల పాదపూజ, శ్రీ రామలింగేశ్వరస్వామికి పంచామృతాలతో, నవరసాలతో అభిషేకము, సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన జరిగాయి. మహాప్రసాదం అనంతరం శ్రీస్వామివారి లీలా కళ్యాణము, శ్రీమహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి నగర పర్యటనోత్సవము ఎంతో భక్తి భరితంగా జరిగాయి. లింగోద్భవకాలం కాలం వరకు సంకీర్తన జరుగుతూనే ఉన్నది.

ఈనెలలోనే ఉగాది, శ్రీరామనవమి, ఉగాది వెళ్ళగానే మౌన ధ్యాన సప్తాహ శిబిరం ఉంటాయి. మార్చి 16న విరోధినామ సంవత్సరం వికృతి నామ సంవత్సరానికి దారి ఇస్తున్నది. శ్రీ సద్గురుదేవులను విశ్వసించి వారి అనుగ్రహానికి పాత్రులైనవారికి ఏ సంవత్సరం అయినా అన్నీ సవ్యంగానే ఉంటాయని, ఏ కష్ట నష్టాలు ఉండవని శ్రీ గురుదేవులు మనకు అభయం ఇచ్చారు. మనం చేయవలసిందల్లా శ్రీగురుదేవుల పట్ల విశ్వాసాన్ని పెంచుకొని వారి అనుగ్రహానికి పాత్రులం కావటమే. ఇదే సత్యాన్ని శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు ప్రబోధ సుధాకరంలో చాటి చెప్పారు. చాతక పక్షులు చావనైనా చస్తాయి కాని మేఘం వర్షించే జలాలను నేరుగా త్రాగటం తప్ప వేరే నీటిని త్రాగవు. అలాగే చకోర పక్షులు చంద్రుడి వెన్నెలలను తప్ప వేరే ఆహారాన్ని స్వీకరించవు. అవి వర్ష జలాలకోసం, చంద్రికలకోసం శూన్యమైన ఆకాశంలోకి అలా చూస్తూ నిరీక్షిస్తుంటాయి. ఆ చాతక పక్షుల, చకోర పక్షుల విశ్వాసం ఎంత గొప్పది అంటే వాటి విశ్వాసానికి ఆకర్షింపబడి శూన్యమైన ఆకాశంలో మేఘుడు వచ్చి వర్షం కురిపిస్తాడు. అలాగే చంద్రుడు ఆకర్షింపబడి వెన్నెలలు కురిపిస్తాడు. మన విశ్వాసం కూడా అంత సుదృఢమైనది అయితే శ్రీ గురుదేవులు ఆ విశ్వాసానికి కరిగిపోయి తమ అనుగ్రహ వర్షాన్ని మనపైన వర్షిస్తారు. భద్రవాక్యంలో దీనిని చూడవచ్చు.

ఈ నెలతో 'గురుకృప' శీర్షిక పూర్తి అవుతున్నది. సుషుమ్న ప్రసాదగారి 'కృష్ణ తత్వము, ప్రేమయోగము' శీర్షికను వచ్చే నెలనుండి ప్రారంభిస్తున్నాము.

- గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

ఎందుకీ దుఃఖం? ఎందుకీ ఆవేదన? ఈ ఆవేదనను, దుఃఖాన్నీ కవులు, పండితులు మాటలతో వర్ణించగలరు గాని, కవుల కవిత్వానికి, పండితుల భాషకు అందని అతులిత ఆనందాన్ని, శాశ్వత సుఖాన్ని ప్రసాదించ గలిగింది పరమాత్మ వస్తువు. అట్టి పరమాత్మ వస్తువును మానవుడు ఏల ఆశ్రయించరాదు?



తనకు తాత్కాలికసుఖాలను,అంతులేనిదుఃఖ పరంపరను కొని తెచ్చే తుచ్ఛ ప్రాపంచిక విషయాల కోసం, ఎంతటి నీచులనైనా ఆశ్రయించటానికి వెనుకాడని మానవుడు, శాశ్వత శాంతి సౌభాగ్యాలను ప్రసాదించే భగవానుని మాత్రం ఆశ్రయించడు. కాని తాను కొని తెచ్చుకున్న కష్టాలకు నష్టాలకు మాత్రం భగవానుని నిందిస్తాడు. ఇది ఏమి ధర్మం? భగవంతుని గట్టిగా మనసారా విశ్వసించాలి. ఊరికే జపమాలను త్రిప్పితే ఏం లాభం? చిల్లికుండతో ఎన్ని నీళ్ళు తోడితే మాత్రం ఏమి నిలుస్తాయి? గాఢ విశ్వాసం కావాలి. చేతిలో జపమాల తిరుగుతుంది. మనస్సు విషయాలపై తిరుగుతుంది. బండికి కట్టకుండా గుర్రాన్ని పరిగెత్తిస్తే బండి నడుస్తుందా? గొలుసులతో తగిలించాలి. దోవ తెలిసిన బుద్ధిమంతుడు ఆ బండిని నడపాలి. అప్పుడే అది చేరవలసిన గమ్యానికి చేరుస్తుంది.

ఈ శరీరమే ఒక సుఖ ప్రారబ్ధ గ్రహచారపు బండి. ఇంద్రియాలే గుర్రాలు. మనస్సు దానిని నడిపే బండివాడు. అహంకార మమకారాలనే గొలుసులతో ఆ గుర్రాలను బండికి కడితే ఆ బండిని ఆ మనస్సు అధః పాతాళానికి తీసుకు వెడుతుంది. అలాగాక, భక్తి వైరాగ్యాలనే గొలుసులతో ఆ గుర్రాలను బండికి కట్టి, బుద్ధిని బండివానిగా నియమిస్తే ఆ బండిని బుద్ధి మోక్ష గమ్యానికి చేరుస్తుంది.

ఒక గురువు వద్ద యిద్దరు శిష్యులు. అందులో ఒకడు స్థిర స్వభావం గలవాడు. వాడిని ఎంత స్వేచ్ఛగా వదిలివేసినా, వాడు మనస్సును యిటూ అటూ పోనియకుండా గురులక్ష్యార్థం మీద నిలిపి ధ్యానం చేసుకుంటూ

ప్రశాంతిగా ఉంటాడు. వాడి శరీరం ఎలా తిరుగుతున్నా ఏ పని చేస్తున్నా మనస్సు శాంతి మయమై ఉంటుంది. ఇక రెండోవాడి మనస్సు అతి చంచలం. అందరి మీద పితూరీలు చెప్పటం, తప్పులెంచటం వాడి స్వభావం. వాడికీ శాంతి ఉండదు. ఎదటి వాళ్ళకీ శాంతి ఉండదు. కాళ్ళూ చేతులూ కట్టి పడేస్తే అయినా కుదురుగా ఉంటాడేమోనని అలా చేశారు. అయినా వాడి మనస్సు మాత్రం అన్ని వేపులా తిరుగుతూనే ఉంది. మనస్సును కట్టలేని వాడి చేతులు కాళ్ళు కట్టి పడేసినా లాభం లేదు. మనస్సును కట్టాలంటే భగవంతుని పాదారవిందాలకే కట్టి పడేయాలి. అంతేగాని విషయాలపై పోనిస్తే అది కట్టబడుతుందా? మనం ఒకటి చెబితే అది నాలుగు చెబుతుంది. అవి నీచ సంస్కారాలు. కాళ్ళు, చేతులు కట్టి పడేసినా, ఊరుకోలేక వాడు దొర్లుకుంటూ గురువుగారి దగ్గరకు వచ్చి మొదటి శిష్యుని మీద ఏవో చాడీలు చెప్పబోయాడు. వంద నమస్కారాలు చేసి అయినా వాణ్ణి వదిలించుకోవాలి. మహాత్ములకు ఒక్కసారి నమస్కారం చేస్తే చాలు. అందుకు కూడా వారు అంగీకరించక, 'అయ్యో! నాలో ఏముంది నాయనా' అని నిరహంకారియై అంటారు. కాని దుష్టుడికి నమస్కారం చేసిన కొద్దీ వాడిలో అహంకారం పెరుగుతుంది. అటువంటి నీచ సంస్కారం గల వాడికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. శివుడికి, విష్ణువుకు ఎంత దగ్గర అయితే అంత మేలు జరుగుతుంది గాని క్షుద్ర దేవతలకు ఎంత దూరంగా ఉన్నా వారి దృష్టి మనపై సోకనే సోకుతుంది. ఏదో అరిష్టాన్ని తీసుకొని రానే వస్తుంది. అంతకంటే అపకారం చేస్తుంది దుష్టుడైన వాడి దృష్టి.

అయితే ఎంతటి దుష్టుడైనా వాని దృష్టిని అయినా మార్చి, అది మనకు అపకారం చేయకుండా మేలు జరిగేలా చేసి శాంతిని ప్రసాదించ గలవాడు పరమాత్ముడు. ఒక్కసారి ఆ పరమాత్ముని ధ్యానిస్తే చాలు. మనకు ఎంతయినా మేలు చేస్తాడు. యిసుకు bottle (విస్కీ bottle) సేవిస్తే కలిగే నిషాలో ఏదో ఆనందం ఉందనుకుంటారు గాని అది విషం bottle కంటె ఎక్కువ అపకారం చేస్తుందని గుర్తించరు. కాని భగవద్ధ్యానంలో కలిగే మైమరుపు మనకు అంతులేని దివ్యానందాన్ని ప్రసాదించగలదు. అది అనుభవించిన వారు ధన్యులు.

ఇప్పుడు ప్రపంచంలో కనపడేది సోమరితనమే. ఇది ఒక చీడపురుగు. చీడపురుగులనైనా మందు మాకులతో వదిలించుకోవచ్చును గాని సోమరితనం

వదిలించుకోవటం చాలా కష్టం. అది ఎంతో చెడును కలిగించి అశాంతికి గురిచేస్తుంది. ఆ సోమరితనపు మత్తులో పడిన వాడు సర్వనాశనమైపోతున్నా తన స్థితిని తాను గుర్తించుకోలేడు.

"నన్ను స్మరిస్తే, నీలోని సోమరితనాన్ని వదలగొట్టి, మంచి ఉత్సాహాన్ని శక్తిని, మేధస్సును ఇస్తాను. నీకు ఎన్నో శుభ, సౌభాగ్యములను అందజేస్తాను. నన్ను విశ్వసించు. స్వధర్మం ఆచరించు. నీచంగా జీవించకు. కష్టపడు. కష్టేఫలే" అంటాడు భగవానుడు. రైతు కష్టపడి, తన చేనును మీగడలాగా దున్ని, నాటు వేసి, కలుపు తీసి, బలం వేస్తే, పంట పుష్కలంగా పండుతుంది. కృషితో నాస్తి దుర్భిక్షమ్, భజతో నాస్తి పాతకమ్, సాధనతో నాస్తి అజ్ఞానమ్. ఏవృత్తి చేస్తున్నా, ఏ పనిలో ఉన్నా భగవన్నామంతో జతపరచి చెయ్యి. ఏదైనా నష్టం వస్తే 'ఎక్కడ తప్పు జరుగుతోంది? ఎక్కడ తప్పటడుగు వేస్తున్నాము?" అని విచారించుకుని తప్పు దిద్దుకుంటే బాగుపడవచ్చు. అలా మానవుడు తన తప్పులను తాను తెలుసుకొని, తన్ను తాను సరిదిద్దుకొని సన్మార్గంలో పయనించటానికి భగవద్ధ్యానం ఎంతో ఉపయోగపడుతుంది.

రాణి రాసమణీదేవి తమ కాళికాలయంలో శ్రీరామకృష్ణ పరమహంసను అర్చకునిగా నియమించింది. శ్రీ పరమహంసలోని దివ్యత్వాన్ని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని గుర్తించి ఆమె ఆయనకు శిష్యురాలై ధ్యానం అభ్యాసం చేయుటం మొదలు పెట్టింది. తరించే మార్గం చూపమని ప్రార్థించింది. శ్రీ పరమహంస తాము అమ్మ సన్నిధిలో ధ్యానానికి కూర్చుంటూ, రాణి రాసమణీ దేవిని కూడా అక్కడ కూర్చుని ధ్యానం చేసుకోమన్నారు. ఆమె అలాగే ధ్యానానికి కూర్చున్నది. శ్రీ పరమహంస తాము ధ్యానానికి కూర్చున్న మరుక్షణమే సమాధి స్థితిని పొంది అమ్మ ఒడిలో కూర్చొని ఆనంద బాష్పాలు రాలుస్తూ తన్మయులై ఉన్నారు. రాసమణీ దేవికి ధ్యానంలో కూర్చున్న కొద్దిసేపటికే కలకత్తా హైకోర్టులో నడుస్తున్న తమ ఎస్టేటు దావాను గురించి, ఫారిన్‌లో ఉన్న తమ కొడుకును గురించి ఏవేవో ఆలోచనలు రాసాగాయి. ఉపాధి అమ్మ సన్నిధిలో, గురుదేవుని దివ్య సన్నిధిలో ఉంటే మాత్రం ఏమి లాభము? శ్రీరామకృష్ణ "అమ్మా! ఈమెలోని మనస్సు అనే సైతాను పీడను తొలగించరాదా?" అని మనసులో అనుకున్నాడు.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ఇక రాత్రి ఆఖరు జాము కృష్ణుడి వంతు. ఆయన కూడా ఆ రాక్షసుడిని చూస్తాడు. కానీ, ఆయన వాడిని చూసి నవ్వడం మొదలు పెడతాడు. ఆయన నవ్వేసరికి ఆ రాక్షసుడు కుంచించుకుపోయి (చిన్నగా అయిపోయి) చిట్ట చివరికి చాలా చిన్నగా అయిపోతాడు. అప్పుడు కృష్ణుడు వాడిని తన ఉత్తరీయం కొంగులో ముడికట్టేసుకుని, తన వంతు కాపలా అయిపోయిందని వెళ్ళి పడుకుంటాడు.



ఉదయం అవగానే, ముగ్గురూ లేచి రాత్రి విశేషాలు చెప్పుకుంటూ వుంటే, బలరామ, సాత్యకిలు రాక్షసుడితో జరిగిన తమ అనుభవం చెప్పి, వాడునీకు కనబడలేదా అని కృష్ణుణ్ణి అడుగుతారు. కృష్ణుడు జరిగిన విషయం చెప్తే, అదెట్లా జరిగిందని బలరాముడడుగుతాడు. అప్పుడు కృష్ణుడు వారిరువురికి, యీ విధంగా చెప్తాడు. "అన్నయ్యా! ఆ వచ్చిన రాక్షసుడు ఎవరో కాదు. వాడు రూపందాల్చి వచ్చిన క్రోధగుణం. వాడిని చూసి మీరు క్రోధ పూరితులయితే, వాడు మరింతగా పెరిగి, చివరకి మిమ్మల్నే కూలబడేటట్టు చేశాడు. నేనూ వాడిని చూశాను. కానీ వాడిని చూసి, నువ్వు నన్నేం చేయగలవన్నట్టు నవ్వడం మొదలు పెట్టాను. వాడు తరిగిపోవడం మొదలుపెట్టాడు. చివరికి వాడొక చిన్న కీటకమంత అయిపోయాడు. వాడిని నా కొంగుకి ముడివేసుకున్నాను - ఇదిగో చూస్తారా? "అని కృష్ణపరమాత్మ కొంగుముడి విప్పబోతే, బలరాముడు, సాత్యకి 'వద్దుబాబోయ్' అంటారు!

ఈ కథని బట్టి మనకి తెలుస్తున్న దేమిటంటే, క్రోధ గుణానికి మనం లొంగితే, అది మనని పూర్తిగా కూలదోసేస్తుంది. ఒకవేళ మనకి క్రోధం (కోపం) వచ్చిందంటే దానిని మనం లక్ష్యం చేయకపోతే, అదే రహితమైపోతుంది.

కనుక ఎల్లప్పుడూ మంచినే స్మరిస్తూ, మంచినే ఆలోచిస్తూ, సత్యాన్ని గుర్తిస్తూ వెళ్ళాలి. ఇటువంటి శిశుమందిరాలు యింకా యింకా అభివృద్ధి చెంది, మంచిని స్థాపించాలి. పిల్లలందరూ అఖండ విద్యనభ్యసించి, కీర్తి ప్రతిష్ఠలను

సంపాదించిపెట్టాలి. సరస్వతీమాత కృప అందరిపైనా వర్షించుగాక! సర్వదా గురుపాదుకలు కాపాడుగాక! అని శ్రీమాతాజీ తమ ఆశీస్సులందచేశారు.

## 5. భిన్నత్వంలో ఏకత్వం

(శ్రీమాఘ గురుపూర్ణిమ 16.02.2003 సందర్భంగా శ్రీదేవీ సహస్ర చండీయాగం సాధుధర్మ సమ్మేళన వేదికపై శ్రీమాతాజీ వారి అనుగ్రహభాషణం).

"ఈ రోజు వ్యాసపూర్ణిమ. ఈ గురుపూర్ణిమ అనేది గురుపాదాన్ని ఆశ్రయించిన ప్రతి భక్తునికీ చాలా విశిష్టమైనదని శాస్త్రాలన్నీ చెబుతున్నాయి. గురుపూర్ణిమ వచ్చిందీ అంటే గురుభక్తుని మనసుకి ఎంతో ఆనందంగా వుంటుంది. గురుతత్వం యింత గొప్పది అని మాటల్లో చెప్పుకోలేము. అది యింతవరకే అని చెప్పుకోలేనిది. గురుతత్వం అనంతం.

ఈ సమస్త సృష్టినీ యిచ్చి, దానిని పోషించి, తిరిగి లయింపచేసే ఏ అనంత శక్తి వున్నదో, అది మహాత్ముల రూపంలో ఒక రూపందాల్చివచ్చి, మనకి ఆధ్యాత్మికానుభూతిని ప్రసాదిస్తున్నది. అది అర్థం చేసుకోవడానికి, అనుభూతికి తెచ్చుకోవడానికి, లక్ష్యశుద్ధి అవసరం. భిన్నత్వంలోని ఏకత్వం దర్శింపచేయడమే మహాత్ముల లక్ష్యం.

మనం నిద్రపోయినప్పుడు మనకేమీ తెలియటంలేదు, కానీ నిద్ర మెలకువరాగానే, నేను ఫలానా అని గుర్తుకి వచ్చి, చేయవలసిన పనులన్నీ గుర్తుకు వస్తున్నాయి. ఇవన్నీ 'తాను' వుంటేనే జరుగుతాయి. ఈ 'తాను' ఎవరు? తనువు మాత్రం కాదు.

అనిత్యమైన జగత్తునే నిత్యమనుకుని భ్రమిస్తున్నాడు మానవుడు. ఇటువంటి భ్రాంతులలో పడిపోయివున్న మానవులని, అనేక విధాలుగా బోధలు చేస్తూ, నిత్యమైన వస్తువునెలా గుర్తించాలో చెప్పి మేలుకొలుపుతున్నారు మహాత్ములు. వారి వారి మనస్సులయొక్క పరిపక్వతను బట్టి ప్రజలు ఆచరిస్తున్నారు. అందులో ఏఒక్క ఆచరించేవాడో, గట్టి ప్రయత్నం చేస్తాడు. పరమాత్మ వస్తువును తెలుసుకోవాలని దృఢమైన పట్టుదలతో సాధన చేస్తాడు. అదే తన జీవిత లక్ష్యమని లక్ష్యశుద్ధి కలిగి, అహర్నిశలూ సాధన చేస్తాడు. అటువంటి వారు తప్పక లక్ష్యవస్తువుని సాధిస్తారు.

జ=జనించి, గ=గతించే యీ జగత్తులో త్=తత్ వస్తువున్నది. అది కనిపించకుండా అంతర్లీనమై వున్నది. అదే యీ సమస్త సృష్టినీ ప్రకాశింపచేస్తున్నది.

ఈ సత్యాన్ని తెలిపేవారే సద్గురునాథులు. **'అప్రత్యక్షో మహాదేవ: సర్వేషాం ఆత్మమాయయా। ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే'** అని, మనభక్తిని సిద్ధింపచేయడానికి, అప్రత్యక్షంగా వున్న ఆ మహాదేవుడే, ప్రత్యక్షంగా గురురూపాన్ని ధరించివస్తాడు. అట్టి సద్గురువులు ఎటువంటి టైటిల్స్ పెట్టుకోరు. ఏ సాధకుడి దృష్టి అంతరంగంవైపు మరలుతుందో, గురువు అక్కడే వుంటారు. విశ్వాసంలోనే వైరాగ్యం వుంది. విశ్వాసం ఆరూఢమైతే, దేవుడెక్కడో ఏడుకొండలపైన లేడు; తన అంతరంగంలోనే వున్నాడని తెలుసుకుంటాడు భక్తుడు. అంతటా వ్యాపించి వున్న శక్తి, ఒక రూపం దాల్చి వచ్చినట్టుగా వస్తారు మహాత్ములు. నీటికి, నీటి బుడగకి తేడా లేనట్టు, ఆ అనంతశక్తికి, మహాత్ములకీ తేడా లేదు.

ఇప్పుడు మనం ఈ దేవీ సహస్ర చండీ యాగం యింత దివ్యంగా జరుపుకుంటున్నాం. ఈ శోభని చూసి ఆనందించే గుర్తింపు మనలో వున్నదే. ఆ గుర్తించే శక్తి ఆ గురుమూర్తే. ఇదంతా నా శక్తి, నావల్లనే అనుకుంటే, అది మనకి పతన హేతువవుతోంది.

"ఇది నాది, అది నాదని విర్రవీగెదవు - ఏదీ నీది కాదురా
నేను-నాది దూరమైనపుడు। నీవు నీవుగా నిలచెదవురా
ఇది నిజమురా, ఇదే సత్యమురా॥
మమకారములో పడకుమురా - మాధవుని తలపరా జీవా.."

ఈ కీర్తన సాక్షాత్ సద్గురుదేవుల ముఖస్థగా వచ్చినది.

దేవుడిని గురించి ఎంతెంతో తెలుసుకోవచ్చు. ఆయన్ని గురించి చెప్పే అనేక పుస్తకాలున్నాయి. భక్తులనేకమంది గురించి, వారెంతెంత గొప్పవారో మనం చెప్పుకోవచ్చు. కానీ వారి గొప్పదనం చెప్పుకున్నంత మాత్రాన, మనకి ఒరిగేదేమిటి? మన మనసుకి పట్టిన వాసనలు వదలక, లౌకిక తెలివితేటలు ఎక్కువై వున్నంత వరకు భగవంతుడు మనకి అందుతాడా? వాసనా రహితమయితేనే కదా వాసుదేవ దర్శనమయ్యేది! ఏపని చేస్తున్నా, లోపల ఒక శక్తి వుండి మనచేత పనిచేయిస్తోందనే నమ్మిక ఆరూఢంగా వుంటే, ఏడుపనేది వుండదు. "ప్రభూ! నీ విభూతి ఎంత గొప్పది! అయ్యా! జీవితం ఎన్నాళ్ళుంటుందో? దానిని నీ సేవకే వినియోగించుకోవయ్యా! "అని ఆ భగవానుని ప్రార్థించాలి.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

శ్రీబాబు ఉద్బోధిస్తూ 'పరమాత్ముడిని మాయ ఆవరించటమా? అసలు పరమాత్ముడికి మాయ భిన్నంగా ఉందా? పరమాత్మనే మాయ ఆవరిస్తే అది ఖండత్వమే కదా! పరమాత్మ అనేది అఖండమైనది కదా! దాన్ని మాయ ఆవరించటమేమిటి? మనం చేసే ప్రసంగం మామిడికాయ గురించా? లేక పండు గురించా?' అని ప్రశ్నించారు. శేషగిరిరావుగారు మాట్లాడుతూ మామిడి పిందె అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ 'ఓహో! మీరు సంస్కృత పండితులు కదా! మీ తెలివితేటలు ఉపయోగించి మామిడిపిందె అనే పదం వాడారు. మామిడిపిందెలో జీడి ఉంటుంది. కాయలో పులుపు అనే అహంకారం ఉంటుంది. పండులో అది లోపించి మధురత్వంగా మారుతుంది. అది ఎంతో ఆకర్షవంతంగా ఉంటుంది. అంతేకాక మధురత్వాన్ని, ఆనందాన్ని అందజేస్తుంది. పండు అయిన తరువాత సంసార వృక్షాన్ని అంటుకుని ఉండదు. అది కాయగా ఉన్నప్పుడు ఆ వృక్షాన్ని అతుక్కుని ఉంటుంది. అందుచేత త్రిగుణములతో కూడి జీవుడు సాధన చేత ఈశ్వరత్వాన్ని పొంద గలుగుతాడు. అయితే పండులోని మధురత్వము అందులోనే ఉందా? బయట నుంచి వచ్చిందా? రావుగారూ! ఇప్పుడు నిర్ణయించుకోండి, మీరు పండా? లేక కాయా? పండు అయితే సంసార సాగరాన్ని దాటగలుగుతారు. కాయ అయితే ఆ వృక్షాన్ని ఎలా వదిలిపెట్ట గలుగుతారు? నేను సాగరంలో దూకుతాను, దూకుతాను అనటమేగాని మీరు నిజంగా దూకగలరా?'

**12.3.1985**

ఈ రోజు శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఇంతమంది పండితుల మధ్య కూర్చుని మాట్లాడాలంటే నా గుండె టకా టకా మని కొట్టుకుంటోంది. వీడు ఒక వెదురు గొట్టం. కాని ఈ గొట్టంలో నుంచి వేణుగానం వస్తుంది. ఆ వేణుగాన మహిమ ఎవరిది? వెదురు గొట్టానిదా లేక నాదానిదా? ఆ విషయాన్ని అలా ఉంచండి. భగవద్గీత జ్ఞానయోగంలో **చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః** అని శ్రీకృష్ణభగవానుడే సెలవిచ్చాడు కదా! దాని మీద మీ అభిప్రాయం ఏమిటి? చెప్పండి భక్తులంతా ఉన్నారు కదా! అన్నారు. ఏమి చెప్తారు? దానికి వక్రభాష్యం ఇచ్చి భగవంతుడే కులవ్యవస్థ ఏర్పరచాడని చెప్తారు. కాని ఆ శ్లోకము క్రింద ఉన్న శ్లోకం మాత్రం ఎవరికీ తెలియనివ్వరు. దాని క్రింద శ్లోకం ఏమిటి తారకం? అని ప్రశ్నించారు శ్రీబాబు.

తారకంగారు మాట్లాడుతూ **తస్యకర్తారమపి మాం విద్ధ్యకర్తార**

**మవ్యయం** అని చెప్పారు. శ్రీబాబు మాట్లాడుతూ మరి దాని అర్థం చెప్పగలవా? తారకంగారు మాట్లాడుతూ నేను కర్తనైనప్పటికి అవ్యక్తమైన నాకు ఆ భేదము లేదని గీతాచార్యుడు చెప్పాడు. శ్రీబాబు కలగజేసుకుని గీతాచార్యుని అంతటివాడికి తేడాలేదుగాని మనలాటి సామాన్యులకు ఉండదని వాదిస్తావా? గీతాచార్యుడు అవ్యక్తుడు, నిర్వికారుడు కాబట్టి వర్తించదని వాదిస్తావా?

మన ఆశ్రమంలో అటువంటి వర్ణవిభేదము అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే తేడా ఉండకూడదు. బ్రాహ్మణత్వం లోపిస్తే సత్యము ప్రకాశిస్తుంది. అదే బ్రహ్మము. నేను క్షత్రియుడను అనే భావము లోపిస్తే శాంతి మిగులుతుంది. అశాంతి అనేది ఉండదు. నేను వైశ్యుడను అనేది జయించగల్గినట్లైతే అక్కడ దయ ప్రకాశిస్తుంది. శూద్రత్వము అంటే అజ్ఞానము. నేను శూద్రుడను అని అనుకోవటమే అజ్ఞానము. అది లోపిస్తే అంతా ప్రేమయే ఉంటుంది. మానవుడు ఈ నాలుగు వర్ణాలను దాటినట్లయితే అంతఃకరణ శుద్ధి చెంది ఆ మనస్సులో నుంచి వచ్చే భావాలు ఎంతో పవిత్రంగా ఉంటాయి.

మానవుడు ఎలా ఉంటాడో ఒక ఉదాహరణ చెబుతాను. తాను ఎంతో పెద్ద భవంతిలో సుఖమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. అతని భవంతి వెలుపల అరుగు మీద ఎవరైనా పేదవాడు విశ్రమిస్తే ఊరుకుంటాడా? చీదరించుకుంటాడు. దానికి కారణం ఏమిటో ఆలోచించండి? మానవుడి మనస్సు ఈర్ష్య, అసూయ, ద్వేషాలతో కూడుకొని ఉంటుంది.

ఉదాహరణకు మామిడిచెట్టును తీసుకుందాం. అది సమస్త జీవరాసులకి నీడనిస్తుంది. మధురమైన ఫలాన్ని ఇస్తుంది. శుభకార్యాలకి ఆకులను అందజేస్తుంది. మామిడి చెక్కని తలుపులకి కిటికీలకి ఉపయోగిస్తారు. మామిడి చెట్టు అంత త్యాగం చేస్తుంది. మరి మానవుడి త్యాగం ఎంతవరకు? ఎవరైనా పేదవాడు సహాయం చేయమని అడిగితే తన వద్ద ధనాన్ని ఉంచుకొని లేదు పొమ్మంటాడు. ఇటువంటి పనులన్నీ చేస్తూ తన మనస్సుని విషయాదుల పైకి వెళ్ళేలాగా భగవంతుడు ఎందుకు చేయాలి? భగవంతుని ఆజ్ఞలేనిదే ఏమీ జరగదు కదా? అనే ఆలోచనలు కూడా కలుగుతాయి అన్నారు శ్రీబాబు.

ఒక భక్తుడు శ్రీబాబుకి తన సాధన గురించి చెబుతూ సంకీర్తన వింటున్నాను అది తోడ్పడుతుంది కదా! అన్నాడు. శ్రీబాబు ఆ భక్తుడిని ప్రశ్నిస్తూ ధ్యానం చేస్తున్నావా? నీ మనస్సు నిలబడకుంటే సంకీర్తన ఎంతవరకు తోడ్పడుతుందయ్యా? సంకీర్తన బాహ్య శబ్దాలు మన మనస్సుకి ఏ విధమైన అంతరాయం కలిగించకుండా తోడ్పడుతుంది. కాని మానవుడిని తరింపజేస్తుందా? ధ్యానంలో నిద్ర వస్తే సంకీర్తన కొంతవరకు నిద్ర రాకుండా తోడ్పడవచ్చు అన్నారు శ్రీబాబు. మనస్సు లక్ష్యార్థం మీద నిలబడితే కృతార్థుడవవుతావు అన్నారు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**మార్చి 2010**

| | | |
|---|---|---|
| 10 | బుధ | శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 13 | శని | శనిత్రయోదశి. |
| 14 | ఆది | మాసశివరాత్రి. |
| 16 | మంగ | శ్రీ వికృతినామ సంవత్సర ఉగాది, పంచాంగ శ్రవణము, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. |
| 17 -23 | | బుధ - మంగళ - మౌన ధ్యాన సప్తాహ శిబిరం |
| 30 | మంగ | చైత్ర శుద్ధ పూర్ణిమ. శ్రీ సద్గురుపాదపూజ. |

**ఏప్రియల్ 2010**

| | | |
|---|---|---|
| 8 | గురు | శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 12 | సోమ | మాసశివరాత్రి |
| 28 | బుధ | శ్రీగురు పూర్ణిమ. సత్సంగ సమావేశం, శ్రీ సద్గురుపాదపూజ. |

## సమర్థ సద్గురు

(యాజమాన్యం తదితర వివరాలు)

Form -4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.No 3 -499 శ్రీ కాళీగార్డెన్స్,నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - జి.యస్. ఆర్ మూర్తి |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.No 3 -499 శ్రీ కాళీగార్డెన్స్,నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.No 3 -499 శ్రీ కాళీగార్డెన్స్,నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియ చేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 31.3.2010 పబ్లిషర్

# సిరికింజెప్పడు, శంఖ చక్రయుగమున్ చేదోయి సంధింపడు....

-డా. పి. సుధారాణి

వైద్య వృత్తిలో నాకు భగవదనుభూతిని కలిగించి, అనంతము, దివ్యము, అపారమైన గురుదేవుని కరుణ యందు నా విశ్వాసమును ఇనుమడింప చేసిన ఒక చిన్న సంఘటన.

వృత్తి రీత్యా గర్భిణీ స్త్రీలు నా పేషెంట్స్. నా క్లినిక్‌లో ఒక గర్భవతి నా వద్ద పరీక్ష చేయించుకుంటున్నది. ఎనిమిది నెలలు నిండిన తరువాత బ్లడ్ ప్రెషర్ (B.P.) కొంచెం ఎక్కువయింది. గర్భిణీ స్త్రీలకు B.P. వెంటనే తగ్గించక పోతే ప్రమాదం. B.P. తగ్గడానికి మందులు వ్రాసి ఇచ్చాను. ఆమె మందులు సరిగ్గా వేసుకోలేదు (ఇంట్లో విపరీతమైన మనస్తాపం కలిగించే సంఘటనలు జరిగినవని తరువాత ఆమె చెప్పింది)B.P. చాలా ఎక్కువై ఫిట్స్ (వైద్య భాషలో Eclampsia అంటారు) వచ్చి నేను వెళ్ళే నర్సింగ్ హోమ్‌లో చేరింది. ఉదయమే నాకు ఫోన్ వచ్చింది. అప్పుడే ఊరినించి వచ్చి బాగా అలసిపోయి ఉన్నాను. అయినా కాఫీ తాగాలనికూడా గుర్తు రాలేదు. వెంటనే పరుగెత్తినట్లే కారులో వెళ్ళాను. గర్భస్థ శిశువుకు పూర్తి నెలలు నిండనందువలన చంటి పిల్లల వసతులు (పిల్లల I.C.U వంటివి) ఉండే పెద్ద ఆస్పత్రికి తరలించి, తల్లికి మందులతో B.P. తగ్గించి సిజేరియన్ ఆపరేషన్ చేసి, తల్లిని, బిడ్డను గురుదేవుని దయవలన కాపాడ గలిగాము. అంతసేపూ మనస్సులో ఎడతెరిపి లేకుండా నా ప్రయత్నం లేకుండా గురు నామస్మరణ జరుగుతూనే ఉన్నది. ఉదయం ఏడు గంటలకు వెళ్ళిన దానిని మధ్యాహ్నం నాలుగు గంటలకు ఇంటికి వచ్చాను. స్నానం, ఆహారం, అలసట అప్పుడు గుర్తు వచ్చాయి. మరుసటి రోజు తల్లికి మళ్ళీ ఫిట్స్ ఎక్కువై అపస్మారక స్థితిని చేరుకోవడం వలన ఇంకా పెద్ద ఆస్పత్రి (గాంధీ హాస్పిటల్) లో చేర్చి రెండు రోజులు ఎమర్జన్సీ వార్డులో ఉంచి కంట్రోల్ చేయవలసి వచ్చింది.

పేషెంట్‌కి ప్రమాదం తప్పి కొంత స్థిమిత పడ్డ తరువాత విచారణ చేసుకుంటే నాకనిపించిందేమిటంటే, కేవలం మానవత్వం ఉన్న ఒక సాధారణ వైద్యురాలినైన నేనే, నన్ను నమ్ముకున్న ఒక పేషెంట్ జీవన్మరణ సమస్యలో ఉన్నదంటే, అన్నీ వదిలిపెట్టి, ఉన్నదున్నట్లు పెరిగెత్తి వెళ్ళానే, మిగతావన్నీ మరచి ఆమెకు స్థిమితం కలిగేవరకు ఆమెను కనిపెట్టుకొని ఆమెతోనే ఉన్నానే,మరి అవ్యాజ కరుణామూర్తి, నిర్హేతుక జాయమాన కరుణాకటాక్ష స్వరూపుడైన భగవంతుడు (గురుదేవులు) మనం ఆర్తితో, సర్వమూ నీవేనన్న ఆరూఢమైన విశ్వాసంతో పిలిస్తే ఎందుకు రాడు? గజేంద్రుని కొరకు, చక్రము చేపట్టక, గరుడుని ఆరోహించక, లక్ష్మీదేవి చీరకొంగు కూడా వదలకుండా పరుగెత్తి వెళ్ళాడు అనే విషయంలో ఎవరికైనా, ఏ కొంచెమైనా అనుమానముంటే, అది మన విశ్వాసంలో లోపమేకాని, గురుమూర్తి దివ్య అనుగ్రహంలో, లోపం కాదని మరొకసారి ఋజువయింది. *

# సత్సంగ సౌరభం

-రామతారక పరబ్రహ్మ ప్రసాద్

శాస్త్రం అనుభవాన్నివ్వదు. కొన్ని ఊహలు కలుగుతై. ఊహలతోపాటు కొన్ని అప ఊహలు కూడ కలుగుతై. అవి చెడ్డవి కూడ వస్తై. సాధన చేసిన మహాత్ములకు అపోహలు ఉండవు. వాళ్ళకు ఆలోచన సరిగా ఉంటుంది. **ధియోయోనః ప్రచోదయాత్**. తమ బుద్ధిని సరైన మార్గంలో ప్రచోదించటానికి సాధన చేశారు గనుక, అది సరిగ్గానే పనిచేస్తుంది. బ్యాటరీ వీక్ (Battery weak) కానంత వరకు గడియారం సరిగ్గా పని చేస్తుంది.

ప్రతివాడు తాను ఉన్న స్థితి కంటె మంచి స్థితికి వెళ్తాడు. ఎంత మంచి స్థితికి వెళ్తాడంటే ఇక అంతకంటె ఉత్తమమైనది లేని స్థితికి వెళ్తాడు. అదే మోక్ష స్థితి.

ప్రాథమిక స్థితిలో పసిబాలుడు పశువుస్థితిలో ఉంటాడు. పశువులకు వాళ్ళకు తేడా ఉండదు. తరువాత తల్లిదండ్రుల వలన వారు సంస్కారం కలవాళ్ళు అవుతారు. కారం అంటే చెయ్యటం. మంచిగా చెయ్యటం అలవాటు చెసికొంటారు. కొన్నాళ్ళు అయ్యే సరికి తప్పు చెయ్యని స్థితికి చేరతారు.

అభ్యాసము ఏదైనా సరే చిత్త సంస్కారం కలుగుతుంది. ఈ సంస్కారానికి రెండు సహాయకారులు. ఒకటి సాంగత్యం. రెండవది సాధన. సత్సాంగత్యం ప్రధానంగా కావాలి. శంకరభగవత్పాదులవారు అన్ని ఉపనిషత్తుల సారాంశం సత్సంగం, **సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవ తరణే నౌకా** అన్నారు. గంగాస్నానం చేస్తే పాపం పోతుంది. శశితాపం పోగొడ్తుంది. కల్పతరువు దైన్యాన్ని పోగొడుతుంది. సత్సాంగత్యం పాపాన్నీ, తాపాలనూ, దైన్యాన్నీ, అన్ని అవగుణాలనూ పోగొడ్తుంది. సజ్జన సాంగత్యం విలువ ఇంత అని చెప్పటానికి వీలులేదు. దానితో సంస్కారం కలుగుతుంది. సజ్జన సాంగత్యం లేకపోతే సంసారంలో పడతాడు. జీవిత లక్ష్యం అదే అనుకుంటాడు. పోనీ తృప్తిగా ఉంటాడా అంటే తాత్కాలిక తృప్తేగాని నిజమైన తృప్తి ఉండదు. అంతకంటే పేరాశ ఎక్కువ అవుతుంది.

శాస్త్రం, సాధన చేసి అనుభవం పొందిన వారి గురించి, వారి చరిత్రలను ఉదాహరణగా చెప్తుంది. అలా చేస్తే చిత్తంలో ఒక సంస్కారం కలుగుతుంది. తెలియకుండానే అనుకుంటారు, అవుతారు.

అయ్యగారి సుబ్బారాయుడు అని ఉండేవాడు. స్వాతంత్ర్య సమరయోధుడు, మంచివాడు. ఆయన బాబుగారి దగ్గరకు వచ్చి లబ్ధిపొందాడు. ఆయన ఏ నియమాన్నీ ఒప్పుకొనేవారు కాదు. అవధూతేంద్ర సరస్వతివారు భోజనానికి కూర్చున్న వారికి ఒక నియమం పెట్టారు. ఊరికే భోజనం చేయటం కాదు. ప్రతివారు వరుసగా రెండుసార్లు హరేరామ హరేరామ అనండి అని అందరితో చెప్పించేవారు. భోజనం చేసేటప్పుడు పశువులు ఎలా దిక్కులు చూడకుండా గడ్డి తింటాయో, అలా దిక్కులు చూడకుండా భోజనం చెయ్యాలని చెప్పేవారు. బాబూజీకి కూడ వారంటే చాల ఆదరం ఉండేది. సుబ్బారాయుడుగారు, ఆ నియమం ఉందని తిక్కవలన భోజనానికి వెళ్ళటం మానేశారు. అవధూతేంద్ర సరస్వతి అంతకన్నా మొండి. ఆ నియమం అలాగే ఉంచారు. మైకులు, స్పీకర్లు పెట్టి ఒకే నామం అలా చేస్తూనే ఉండేవారు. కొన్నాళ్ళయ్యే సరికి సుబ్బారాయుడుగారు ఒక రోజు ఇదేమిటి? అనుకోకుండా నేను కూడ నామం అంటున్నానే అనుకున్నాడు. మనస్సును దేనిలో ఊరవేస్తే దానికి ఆ రుచి వస్తుంది. అతడు కపటం లేనివాడు. బాబూజీ ఎలా ఉంటారు అనే దాని మీద వ్రాశాడు. సాంగత్య ప్రభావం వద్దు అన్నా కూడ లాభం లేదు. అసలు అది మనలో ఉన్నదే. మొదట్లో చొక్కా విప్పను, దండం పెట్టను అన్నవాళ్ళు కూడ తరువాత వాళ్ళే దారిలోకి వచ్చారు.

చెడుదానంతట అది పోదు. చీకటి పోవాలంటే దీపం వెలిగించాలిసిందే. అలాగే చెడుపోవాలి అంటే నీకు ఇష్టంలేక పోయినా మంచి వాళ్ళతో సాంగత్యం చెయ్యి? ఆదిత్య హృదయం, హనుమాన్ చాలీసా కూడ రానక్కర్లేదు. హనుమంతుడి నామం చేస్తే కూడ చాలు. హనుమంతుడు బుద్ధిమతాం వరిష్ఠం. అంతకంటే బుద్ధిమంతుడు లేడు. కాసేపు కలసి ఉంటే చాలు. సాంగత్యం వలన ఆ గుణాలు వస్తై.

అనుభవానంద అని ఒక గొప్ప పండితుడు ఉండేవాడు. గురువుగారి బంధువు ఒకామె ఒకసారి ఆయనను నిలదీసింది. ఆమెకు పెద్దగా చదువు రాదు. కాని వాళ్ళు గురు సంప్రదాయంలో ఉండటం చేత మహావాక్యాలు చెప్తుంటే విన్నది. సన్యస్య శ్రవణం కుర్యాత్. శ్రద్ధగా వినాలి. ఎన్ని మహావాక్యాలు కంఠస్థం చేసినా, చివరకు తెలుసుకొనేది నగురోరధికం నగురోరధికం అని, గురువును దేనితోను పోల్చటానికి లేదు, అభ్యాసం, సాంగత్యం చేత మంచి సంస్కారాలు కలుగుతై అని.

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి)

-మనోజ్ కుమార్

"హరుడు లక్ష్మీరూపం ధరించి శారఙ్గధరుణ్ణి వరించాడు.
గరుడ రూపం ధరించి విష్ణు వాహనం అయ్యాడు మహేశ్వరుడు.
శక్తి రూపం ధరించి శారఙ్గపాణి, నారాయణుడు అయ్యాడు భవాని
శారఙ్గధరుడు నందియై శివుడి సముఖాన కూర్చున్నాడు........"

విసోబా అనుగ్రహం పొంది పంఢరివైపు తిరిగి వస్తున్న నామదేవుణ్ణి అందరూ నామదేవమహరాజ్‌గా గుర్తించారు. నామదేవుడి రాకకై చంద్రభాగ ఆత్రంగా ఎదురుచూస్తున్నది. పుండలీకుడు తన రాకకై ఎదురు చూస్తున్నాడు. పాండురంగడు నామదేవుడు పెట్టే నైవేద్యం కోసం ఎదురు చూస్తున్నాడు. పతివ్రత అయిన రాజాయి అన్ని సంసార చింతలు పాండురంగడి చరణాల వద్ద వదలి, భర్త ఆగమనం కోసం చకోర పక్షిలాగ ఎదురు చూస్తున్నది. గురు కృపవలన విఠలుడి రూపం మిథ్య అని అనుభవానికి వచ్చినా నామదేవుడికి మాత్రం ఆ నల్లని విఠలుని సగుణ సాకార రూపం ఎప్పుడు చూద్దామా, విఠలుడి ప్రేమరసాన్ని ఎప్పుడు ఆస్వాదిద్దామా అని తొందరగా ఉన్నది.

ఔంఢ్యా నాగనాథ్‌లో విసోబాఖేచరి నామదేవుణ్ణి అనుగ్రహించారని, నామదేవుడి సంకీర్తన వినటానికి శివుడు తాను పశ్చిమం వైపు తిరగటమేకాక మందిర మహాద్వారాన్ని సైతం పశ్చిమంవైపుకి త్రిప్పారని, నంది, తాబేలు తాము కూడా ఆ సంకీర్తన వినటానికి పశ్చిమం వైపు తిరిగారని, నీలకంఠ శాస్త్రిగారు కూడా శివకేశవుల భేదం విస్మరించి అద్వైత ధ్యానంలో మునిగి పోయారన్న వార్త నామదేవుడి రాకకంటే ముందుగా ప్రయాణించి అందరికీ తెలిసిపోయింది. విసోబా ద్వారా పూర్ణజ్ఞానం పొందిన నామదేవుడు హీనకులస్థుల, దీనుల పక్షాన ఉన్నాడని, అతన్నేమైనా చేసినా, రెచ్చగొట్టినా అతడు ఆ హీనకులాలవాళ్ళతో ఆలయ ప్రవేశం కూడా చేయిస్తాడేమో అని భయపడుతున్న అగ్రకులాల వారికి ఏమి చేయటానికి పాలు పోవటం లేదు. వాళ్ళు కేవలం నైవేద్యం చేయి చూపించే పూజారులు మాత్రమే. కాని నామదేవుడు నైవేద్యం తినిపించే భక్తుడు అన్న నగ్న సత్యాన్ని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించకుండా ఉండలేకపోయారు.

పంఢరి పరిసరాలన్నీ నామదేవుడి సంకీర్తనతో మారుమ్రోగు తున్నాయి. రుక్మిణి మండపంలో పరిసాభాగవతార్‌గారి భాగవత ప్రవచనానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా తగ్గ సాగింది. ఆయన బాళ శాస్త్రిగారితో తన

గోడంతా వినిపించుకున్నాడు. అంతా విని ఆయన నామదేవ్ సనాతన ధర్మాన్ని పటిష్ఠం చేస్తున్నాడు. దానికి సంతోషించటం పోయి అతని మీద పగ పట్టటమా? అతడు ప్రేమపరిభాష తెలిసినవాడు. అతనితో నాలుగు మాటలు ప్రేమగా మాట్లాడి సమస్య పరిష్కరించుకోమని సలహా ఇచ్చారు.

భాగవత శ్రవణానికి నామదేవుడు వస్తున్నాడనగానే రుక్మిణి మండపమంతా శ్రోతలతో క్రిక్కిరిసిపోయింది. తాను బ్రాహ్మణ కుల సంజాతుడననే ఆభిజాత్య గర్వంతో, మహా విద్వాంసుడననే అహంకారంతో కళ్ళు మూసుకొని పోయిన పరిసాను మార్చాలంటే అతనితో వాదించటంలో అర్థంలేదు అని ఆ పరిసాను ప్రేమతోనే జయించాలి అని అనుకున్నాడు నామదేవుడు. "భూదేవా! మీరు కులశ్రేష్ఠులు. నేను కులహీనుణ్ణి. మీ పాదతీర్థం, చరణధూళి ఇన్నాళ్ళు తీసుకోలేక పోయాను. బహుశః అది నేను చేసుకున్న పాపఫలం వలన అయి ఉంటుంది. మీ పాదాలకు నమస్కరిస్తే చాలు, అన్ని పాపాలు హరిస్తాయి. ఇక రోజూ మీ పాదముల వద్ద కూర్చొని భాగవతం వినటానికి అనుమతి ఇవ్వండి'' వినయంగా అన్నాడు నామదేవుడు.

భాగవత ప్రవచనం చేసి ఇంటికి వచ్చిన పరిసా "వింటున్నావా! అదే ఆ దర్జీవాడు లేడూ, ఎవరు? ఆ దామాసెట్టి కొడుకు, వాడే ఆ నామాసెట్టి ఈవేళ నా పాదాలమీద పడి గట్టిగా పట్టేసుకున్నాడు. అందరూ వింటుండగా వాణ్ణి బాగా దులిపేశానులే. శరణు ప్రభూ అంటూ పాదాలు వదలితేనా...'' భార్యతో గర్వంగా చెప్పాడు. పరమ పతివ్రత అయిన కమలజ ఇది విని ఖిన్నురాలైంది. ఆమె మనస్సు కలత చెంది శూన్యమైంది. పొయ్యిమీద మరుగుతూ పొంగు వచ్చిన చారుని పట్టుకారతో దింపాలని కూడా తోచలేదు. ఉత్త చేతులతో అలాగే దింపి క్రింద పెట్టింది. ఆమె చేతులు కాలి బొబ్బలెక్కాయి. పరిసా నొచ్చుకుంటూ అన్నాడు "పట్టుకారతో దింపక ఉత్త చేతులతో దింపావు. చూడు చేతులు కాలి ఎలా బొబ్బలెక్కాయో.'' అదుపు మీరిన అహంకారంతో ఎప్పుడూ గర్వంగా డాంభికంగా మాట్లాడే భర్తను తలచుకొని తలచుకొని సహనం పూర్తిగా నశించిన కమలజ భర్తతో అన్నది "మీ మాటలలో అలవి మాలిన గర్వం, దర్పం, అహంకారం కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. మీలో నేను బ్రాహ్మణ శ్రేష్ఠుడను అన్న గర్వం పాతుకుపోయింది. ఆ గర్వమే లేకుంటే మీరు ఇంట్లో కూర్చుంటే కూడా భగవంతుడు మీకు స్వయంగా దర్శనం ఇచ్చి ఉండేవాడు. మీ గర్వం ఎంత వరకు పోయింది అంటే సాక్షాత్తు పరమేశ్వరుడే మీ దగ్గరకు వచ్చి మీ ఎదురుగా నుంచున్నా ఆ

గర్వం వలన మీరు ఆ పరమేశ్వరుణ్ణి గుర్తించలేకపోయారు.''

ఒకరోజు నామదేవ్ పరిసాతో గంభీరంగా "సజ్జనులను, భక్తులలోని భగవంతుణ్ణి గుర్తించలేని పాండిత్యం ఉండి దేనికి? ఇకనైనా మీ వృథా అహంకారం మానండి. సజ్జనులను శరణుపొంది నిజమైన భక్తి ఏమిటో తెలుసుకోండి. మీరు పోగొట్టుకున్న పరమేశ్వరుడు లేదా ఆత్మవస్తువు మీకు సజ్జనులలో, వారి వాక్కులలో, వారి అశీస్సులలో తప్పక దొరుకుతుంది. అంతరంగంలోని మాలిన్యాన్ని అంతటినీ పూర్తిగా తొలగించుకుంటేగాని మీకు పూర్ణబ్రహ్మ స్వరూపానుభవం కలగదు. సత్యాన్ని గుర్తించండి, ఆచరించండి'' అని అనునయంగా చెప్పాడు. పరిసాలో ఒక్కసారిగా జ్ఞానం మేలుకుంది. అతడు దీనాతిదీనంగా 'నామదేవ్ మహరాజ్!' అంటూ నామదేవుని పాదలమీద వాలిపోయాడు. నామదేవుడు అతనిని సాదరంగా లేవదీస్తూ కరుణామృతాన్ని కురిపిస్తున్న దృక్కులతో పరిసా కళ్ళలో చూశాడు.

ఇంట్లో అడుగు పెడుతున్నపరిసావైపు చూచింది కమలజ. తన భర్త దైవానుగ్రహానికి పాత్రుడైనాడని చెప్పకనే తెలిసిపోయింది. ఏదో దివ్య లోకాలలో విహరిస్తున్నప్పుడు కలిగే దివ్యానందం అతని ముఖంలో కొట్టవస్తున్నట్టు కనిపించటమే దానికి గుర్తు. కమలజ ఆశ్చర్యంతో అశ్రుపూర్ణ నయనాలతో భర్త వంక ఆరాధన భావంతో, భక్తిపూర్వకంగా చూస్తూ "ఏమండీ! మీ భార్యనైనందుకు నా జన్మ ధన్యమైంది. మిమ్మల్ని ఇప్పుడే గుర్తించాను. మీ పాదాలకు నమస్కరిస్తున్న ఈ చరణదాసిని ఆపకండి అంటూ అతని పాదాలపై వ్రాలింది. పరిసా ఆమెను సాదరంగా లేవదీస్తూ తన గురుదేవులైన నామదేవ్ మహరాజ్‌ను తలచుకొని మరీ మరీ ఆనందించాడు. తన భర్త నామదేవ్ మహరాజ్ కృపకు పాత్రుడైనందుకు కమలజ ఇంకా ఆనందించింది.

నామదేవుడికి అన్ని ధర్మాలూ, మతాలూ, జాతులూ, కులాలయందు సమభావం కలిగింది. అగ్రవర్ణాలు ఈసడించుకున్న హీనకులాల వారికోసం అతడు చంద్రభాగ ఇసుక తిన్నెలలో ఒక వేదిక నిర్మించి దానికి వ్యాసపీఠిక అని పేరు పెట్టాడు. ఎవరైనా సరే జాతి, మత, కుల వివక్షత లేకుండా అక్కడ నామదేవుడితో కలసి సంకీర్తన చేయవచ్చు. ఇప్పుడు పరిసా కూడా నామామృతంతో తన అహంకారాన్ని చంద్రభాగలో కలిపి, నామదేవునితో సంకీర్తన చేయటానికి చేతులు కలిపాడు. ఇంకా చాంగాదాస్, సేనామంగలి, మంగళవేఢ నుండి చోఖామేళ అతడి భార్య సోయరాబాయి, అతడి చెల్లెలు నిర్మల, ఆమె భర్త మొదలైనవారంతా సంకీర్తనలో నామాకు తోడైనారు. అప్పుడప్పుడూ గోరకుంభార్ కూడా వచ్చేవాడు.

-సశేషం

# గురుకృప

(గతసంచిక తరువాయి) -శివ ప్రసాద్

**గౌత-** (ఏమీ తెలియనట్లు) నాయనా! మిత్రసహుణ్ణి అడిగి మదయంతి కుండలాలను తేవటానికి ఇంతకాలం పట్టిందేమిటి? ఎక్కడెక్కడికి వెళ్ళావు? ఏమేమి చేశావు? ఏమేమి చూశావేమిటి?

**ఉదం -** గురుదేవా! సర్వజ్ఞులైన మీ కృపవలన కాకపోతే ఆ సౌదాస నరేంద్రుడైన మిత్రసహుడు ఎక్కడ ఉన్నాడో తెలుకోగలిగేవాడినా? నరమాంస భక్షకుడైన ఆ మిత్రసహుడు నాతో శాంతవచనములు పలికేవాడా? ఆ మిత్రసహుని భాగ్యం పండింది. అతడు బ్రాహ్మణులకొనరించిన సేవ ఫలించింది. అందుకే నిర్హేతుకమైన, మీ కృపాకటాక్ష వీక్షణము అతనిపై పడింది. అందుకే గురుపత్ని, అతని పత్ని, పరమ పతివ్రత అయిన మదయంతి దేవి కుండలాలను కోరింది. గురుపత్ని అలా ఆ కుండలాలను కోరటం మీ లీలయే. సౌదాస నరేంద్రుని విప్రార్చన ఫలంగా కుండలాలను దానం చేసిన ఫలంగా నా స్పర్శ వలన అతనికి శాప విముక్తి అయినట్లు కనిపించటం కూడా మీ లీల. అతని శాప విముక్తికి వాస్తవానికి ఇవి కారణాలు కానే కాదు. అతడిపై అమృతశీకరముల కన్న చల్లనైన మీ కృపావృష్టి కురవటం ఒక్కటే నిజమైన కారణం. నేను కుండలాలు తెస్తుంటే వాటిని తక్షకుడు అపహరించి నాగలోకానికి తీసుకెళ్ళాడు. అది కూడ మీ లీల. గురుకృపకు పాత్రుడైన వానికి సకల దేవతల అనుగ్రహం అదే లభిస్తుందని మళ్ళీ ఇంకొకసారి అనుభవం అయింది. ఒక దివ్య పురుషుని సాయంతో పాతాళలోకం చేరటానికి కూడ మీ కృపయే కారణం. అక్కడ మీ నిత్యార్చనతో సంప్రీతుడైన అగ్నిహోత్రుని సాయంతో కుండలాలు తిరిగి పొంది క్షణంలో మీ పాదాల దగ్గర ఉండగలగటం కూడ మీ కృపాఫలమే. లేకపోతే ఇవన్నీ నా వల్ల అయ్యేవి కాదు అని నాకు నిశ్చయంగా తెలుసు. పరీక్షలు పెట్టేదీ మీరే. శిష్యులకు సాయపడి వారు ఆ పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యేలా చేసుకునేదీ మీరే. మాలో ఎక్కడ అహంకారం తలయెత్తుతుందో అని మీరు అనుక్షణం మమ్మల్ని కంటికి రెప్పలా కనిపెట్టి చూస్తూ, రక్షిస్తూ ఉంటారు. గురుదేవా! మీ ఈ అద్భుత లీలలో నాకు అర్థం కానివి ఇంకా కొన్ని మిగిలిపోయాయి. మీరు అనుగ్రహిస్తే మీ దగ్గర ఆ రహస్యాలను తెలుసుకోవాలని ఉన్నది.

**గౌత -** వత్సా! నీ మనోగతం అవగతమైంది. నీకు మొదట మహోన్నతమైన

ఉక్షమును ఎక్కి కనిపించిన దివ్య పురుషుడు ఎవరో కాదు, ఇంద్రుడే. ఆ వృషభము ఐరావతము. మర్త్యులకు అమృతం ఇవ్వటం ఇంద్రుని అభిమతం కాదు. అందువలననే అతడు నీకు దానిని వృషభ గోమయం రూపంలో చూపి నిన్ను తినమన్నాడు. నీవు దానిని భక్షించి అశుచివి కావటం ఇష్టంలేక అతడు కోరుకున్నట్లే అసహ్యించుకొని నిరాకరించావు. అతడు లోలోపల సంతోషించాడుకాని గురుభక్తునికి సాయం చేయక తప్పదు గనుగ నీ పాదాలకు, నొసట పూసుకొమ్మని చెప్పి నిన్ను సౌదాస నరేంద్రుని వద్దకు చేర్చాడు. నీవు కాష్ఠముతో భూమిని త్రవ్వుచున్నప్పుడు వచ్చిన బ్రాహ్మణుడు కూడ ఇంద్రుడే. అతడే ఆ కాష్ఠపు మొనకు వజ్రాయుధముయొక్క పదునును శక్తిని ప్రసాదించాడు. అందువలననే నీకు భూమి వెంటనే పాతాళానికి, నాగలోకానికి దారి ఇచ్చింది. నాగలోకంలో నీకు సాయం చేయటానికి వచ్చిన దివ్య పురుషుడు పర్జన్యుడు. సరే అశ్వము అగ్నిదేవుడని నీకు తెలుసు కదా! నీవు నాగలోకంలో చూచిన స్త్రీలిద్దరూ ధాత, విధాత. తెలుపునలుపుల సంతాన పటతంత్రము పగలు, రాత్రులు. ద్వాదశారములు కల చక్రము పన్నెండు మాసములతో కూడిన సంవత్సరం. దానిని త్రిప్పుతున్న కుమారులు ఆరుగురు ఋతువులు. నాయనా! నేను నిజమే చెబుతున్నాను. నీవు మహిత చరితుడవు. నీ చరిత్ర మహనీయము. మిత్రసహుడి రాక్షసత్వమును బాపి అతడి తొల్లిటి మానుషరూపమును, సాధుస్వభావమును ప్రసాదించటం, కుండలములు అపహరించిన తక్షకుని వదలక అతని వెన్నంటి అహిలోకమునకు వెళ్ళి నేర్పుతో ఆ కుండలాలను సాధింటం, ఆ ఓర్పు, ఆ చతురత, ఆ దృఢ నిశ్చయము, ధర్మవర్తన ఇవన్నీ ఇతరులకు సాధ్యమయ్యేవి కాదు. నీ ఏకనిష్ఠ గురుభక్తితో అనన్య సాధ్యమైన ఈ కార్యమును సాధించి మాకు అత్యంత ప్రియమును చేకూర్చావు. గురు ఋణమును తీర్చుకున్నావు. గురు ఋణం తీర్చుకున్నవానికి అణిమాద్యష్ట సిద్ధులూ, అనంత పుణ్య రాసులూ, ఆత్మజ్ఞానం కలగటంలో ఆశ్చర్యమేమున్నది? ఇక నీవు నీ ఆశ్రమ ధర్మాన్ని చక్కగా నిర్వర్తిస్తూ యథేచ్ఛగా జీవించు. గురుశక్తి నిన్ను సర్వదా రక్షిస్తూ ఉంటుంది.

వైశంపాయనుడు జనమేజయునితో, మహారాజా! ఏకనిష్ఠ గురుభక్తుణ్ణి గురుకృప సర్వదా రక్షిస్తూ ఉంటుంది. అటువంటి మహిత చరిత్రుడు ఆ భార్గవుడు. అని ఉదంకుడి గురుభక్తిని గురించి చెప్పాడు. *

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

**10 శ్లో॥ అపాఙ్గ శేఖాభిరభఙ్గురాభి రనఙ్గలేఖా రసరఞ్జితాభిః**
**అనుక్షణం వల్లవసున్దరీభిరభ్యర్చ్యమానం విభుమాశ్రయామః ॥**

తననెవరో తలచినట్లు పిలిచినట్లు అనిపించి నలువైపులా కలయచూశాడు అనంగుడు. గుర్తించాడు. వారు... వైకుంఠవాసి వసుదేవ కుమారుడై అవతరించి, నందయశోదా తనయుడై పెరుగుతున్న వ్రజభూమిలోని గోపాంగనలు. ఆ క్షణాన్నే వారిముందు నిలిచాడు. తనకి రూపంలేదు. అయినా వారు తమకు దేవదేవుని ఎడలగల అపారమైన ప్రేమబలంతో తనని చూడగలుగుతున్నారు. "అమ్మలారా! ఏమి సెలవు?" అన్నాడు వినయంగా మన్మథుడు చేతులు జోడిస్తూ. వాని రాకకు సంతోషించిన గోపికలు "అయ్యా! నీ వలన మాకో సాయం అవసరమై నిన్ను పిలిచాము" అన్నారు. మదనుడు ఉలిక్కిపడ్డాడు. తన సాయమా! నాటి సంగతి గుర్తుకువచ్చి చలించిపోయాడు. నాడు... ఆనాడు.... ఇంద్రుడు అలాగే "దేవతల కార్యసిద్ధికై శివపార్వతుల కల్యాణం జరగ వలసి ఉంది, తపస్సమాధిలో ఉన్న ఆ పరమేశ్వరుడు నీ బాణానికి సాధ్యుడు గాని ఇతరసాధనాలేమీ పని చెయ్యవు. ఆ మహాత్ముని ఎడదలో బీజం మొలకెత్తడానికి ప్రధానమైన నీటి వంటివాడవు నువ్వు. సర్వ ప్రదేశాలలోను నిరాటంకంగా సంచరించగలవు. ఇప్పుడు నీ సాయం ఎంతో అవసరం అని పిలిచాను" అనగానే తనలో అహంకారం పడగవిప్పింది. ఇంద్రునితో "ఎవరైతే నీకిష్టం లేకుండా జనన మరణ వలయంనించి విడివడి మోక్షమార్గాన్ని కోరతారో అలాంటివారిని సైతం అతివల క్రీగంటి చూపులతో కట్టిపడేస్తాను. అలాంటిది నాకిదెంత పని! మృదువైన పుష్ప బాణాలతో పినాకపాణి నిబ్బరం నాశనం చేస్తాను" అని గర్వంగా పలికాడు. దేవతల కార్యం చక్కబెట్టడానికి వెళ్ళిరమ్మని వెన్ను తట్టి ఉత్సాహపరచిన ఇంద్రుని వాక్యాలు తనను కార్యోన్ముఖుని చేశాయి. ఫలితం.... 'వినయభయభక్తులెదలోన పెనగొనగా ప్రియభావనతో సేవించి మహాత్ముల మనసు చూరగొనాలి గాని అహంకరిస్తే అధఃపతనం తప్పదు' అని తన ద్వారా లోకానికి ఒక సత్యం వెల్లడిస్తూ హరుడు మూడోకన్ను తెరిచి తనను చిటికలో భస్మం చేశాడు. ఇప్పుడు తను అశరీరుడు. దురదృష్టం!

నేడు.... పుణ్యాత్ములు, హరిసేవా తత్పరలు అయిన గోపీజనులు తన సాయం అవసరమంటున్నారు. దేవసీమలోని వారంతా బృందావన విహారి

అయిన గోపాలుని దివ్యలీలను పదేపదే చెప్పుకుంటూ, గగన భాగాన నిలిచి వాని దివ్య మంగళమూర్తిని చూస్తూ పరవశించి పోతూ, అమరులైన తమకి గోకులంలో పుట్టి వారందరితో కలసిమెలసి తిరుగుతూ ఆ ఆనందాన్ని అనుభవించేభాగ్యం లేదు అని నిట్టూర్పులు విడుస్తుంటే నేటికి తనకీ తావుకు రాగలిగే మహద్భాగ్యం గోపీజనులద్వారానే లభించినపుడు అందుకు కృతజ్ఞతా పూర్వకంగా వారు కోరే సాయం చేయవలసిందే ననుకున్నాడు మన్మధుడు. పెదవి కదిపాడు. "నా వలన మీరే సాయం కోరుతున్నారో చెప్పండి" అన్నాడు. "మా నాధుడు మా ఎడలగల పరమ ప్రీతితో అడగకనే మాతో అనేక క్రీడలు లీలలు సలిపి మమ్మల్ని బ్రహ్మానంద సాగరంలో ఓలలాడిస్తుంటాడు. ఆ క్షణాలలో వాని సమ్మోహనకరమైన ముఖారవిందాన్ని చూస్తూ మేము నోట మాటరాక తన్మయులమై నిలిచిపోతాము. ఆదేమన స్వామికి మా కృతజ్ఞతలు ఎలాగ తెలపాలో తెలియక తికమక పడిపోతున్నాము. మరి మా మనోభాలకు అద్దం పట్టే అక్షరాల రూపంలో వెల్లడిద్దామంటే మేము ఏ చదువులు రానివాళ్ళం. ఇలాంటి సమయంలో మాకు తోడ్పడేవాడిని ప్రేమాధి దేవతవైన నువ్వే తగినవాడివని తోచింది. నిన్ను రమ్మన్నాము. అనురాగ రసరాజ్య చక్రవర్తి అయిన మా గోకుల నాధునికి మా హృదయాలలో మెదిలే మధురభావ సారాన్ని అందించే బాధ్యత నీ మీదనే ఉంచుతున్నాము" అన్నారు వేడుకోలుగా వ్రజకాంతలు. అంగీకార సూచకంగా తలాడించి నిలిచాడు అంగజుడు.

-సశేషం

## గురుమహిమా! గురుమహిమా!

అపార గురుమహిమను మనం అనుభవిస్తున్నాం.శ్రీ గురుదేవులు మనతో ఉండిమనలనునడిపించి మనకు వచ్చే కష్టాలనుండి కాపాడుతున్నారు. మీ అనుభవాలను తత్త్వపరంగా వ్రాసి మాకు ప్రచురణకు సమర్థ సద్గురు ఎడ్రస్‌కు పంపండి -ఎడిటర్

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ మహరాజ్ వారి ప్రియశిష్యులైన శ్రీగోనిగుంట్ల బాలచంద్రుడుగారు ది. 7.2.2010న గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 61 సంవత్సరాలు. వీరికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీ గురుదేవులు వారికి మనోధైర్యమును చిత్తశాంతిని ప్రసాదించెదరుగాక!

# మౌనధ్యాన సప్తాహశిబిరం

-రమణ ప్రసాద్

గురుబోధను ఎంత అమలు పరిస్తే అంత తరిస్తాం. మృతమైన జీవలక్షణాల నుంచి వచ్చే అహంకారాన్ని హరిస్తుంది గురుబోధ.

**ఏ ఈతిబాధ ఎదురైనగాని మోహవికారము మూసినగాని**
**నీ పాదసేవ విడదీయకన్న శరణాగతావన హే జగన్నాథ!**

ఈ పాటలోని ప్రతి పదాన్ని అర్థం చేసికొని ఆచరిస్తే పదములు అంటే బోధామృతం లభిస్తుంది. దాని ద్వారా పదం గురుపదం పొందుతాం. ఈతి బాధలను సాక్షీమాత్రంగా చూస్తూ ఉంటే అనుభూతి లభిస్తుంది. మనకి గురుదేవులు అందించిన బోధను ఒకరికొకరు చర్చించుకోవాలి. అలా వీలు కాకపోతే మనమే మననం చేసికోవాలి. సత్యం మనలోనే ఉంది కాబట్టి వారి గుణగానము మనకు అమృతపానం అయింది.

సర్వాంతర్యామి, అంతటా వ్యాపించిన మహాశక్తి సాక్షాత్తు అవతారం ధరించి వచ్చారు. ఆయన కృప మనం పొందాలంటే ఆయనలో లేనివి తీసివేసికోవాలి. అక్కడ లేనిది ఉన్నది అని భ్రమ చెందితే మనమే పతనమవుతాం.

సముద్రం పైన వెతికితే నత్తగుల్లలు వస్తాయి. ఇంకా లోపలికి వెళ్ళి వెతికితే రత్నాలు దొరుకుతాయి. ఈతి భాధలలో పడినందుననే మనం భగవంతుని అనుగ్రహాన్ని పొందలేకపోతున్నాము. ఆయనకు మానవునికి ఉన్న స్వభావాన్ని ఆపాదిస్తున్నాము. స్వామి చెప్పారు - ధ్యానంలో కోరిక పెట్టుకోవద్దు. నీకు ఏది కావాలో ఆయనే చూసుకొంటాడు. ఎలా ఆదుకొంటున్నారో! కంటిని రెప్ప కూడా ఆదుకోలేని ఆదరణను, దివ్యమైన సుకృతాన్ని మనకు ప్రసాదించారు. దానిని నెమరు వేసుకుంటే అమృతమయులమవుతాం.

**మమకారములో పడకుమురా మాధవుని తలపరా జీవా!**

మనస్సుకు ఏది అలవాటు చేశామో దానినే మనస్సు వెదుకుతుంది. దానినే సాధన అన్నారు గురుదేవులు. బియ్యంలో రాళ్ళు ఏరటం; మనలో కూడా పలుకు ఉంది. మనస్సు పక్వం అవాలి అంటే గురుదేవులు ఇచ్చిన సూచనలను మేళవించి ఈ ప్రపంచం అనే భవసాగరం నుండి బయటకు రావాలి. ఏది అడ్డురాకుండా ఉన్నది? భోజనం చేయాలంటే హోటల్‌లో టేబుల్ కోసం వెయిట్ చేస్తాం. 15, 20 మంది ఒక్కసారి వెళితే మనం భోజనం టేబుల్ దగ్గర వెయిట్

చేయాలి. బాగా ఆలశ్యం ఉంటే బుఫే ఇచ్చేయండి సార్ - అంటాం. భద్రాచలంలో గోపన్నకు ఉపదేశం చేయమని రామాజ్ఞ అయితే కబీర్‌దాసు కాశి నుండి ఝాం అని ఎగిరి గోపన్న దగ్గర వాలాడు. ఉపదేశం జరిగింది. గోపన్నగారు కూడా ఎందరినో తరింపచేశారు. నువ్వు ఎట్లా ఉన్నా ఫరవాలేదు మనస్సు నాపై ఉంచు అంటాడు భగవానుడు. ఇవాళ మనం పూజ చేసుకొన్నాం విఠ్‌లదాస్‌గారి స్మారకంగ. ఆయనకు బాబు ఇచ్చినపేరు చరణదాస్. వచ్చేది వెళ్తుంది. మనం ఒక సమర్ధుడైన గురుపాదం దగ్గర చేరాం. "ఒరేయ్! ఇది పోయేది అని చెప్పగా చెప్పగా ఇది నాది నాది అన్నది; నేను, నాది దూరమైతే నీవు నీవుగా నిలుస్తావురా" అని ప్రబోధ చేశారు శ్రీ గురుదేవులు.

స్వామివారి పాదం ఎక్కడ లేదు? నీ దగ్గర లేదా? సర్వ వ్యాపకమైన పాదం దగ్గర దాసుడవుకా. సత్య వస్తువునే శరణుపొందు.

శబరికి శరణు ఎవరు ఇచ్చారు? ఉడుతకు శరణు ఎవరు ఇచ్చారు? మనకు అడ్డు పడేవి త్రిగుణాలు - సత్వరజస్తమోగుణాలు. వాటిని సరిదిద్దుకోమన్నారు గురుదేవులు. అలా దిద్దుకొన్నవారే గురుదశమిని గుర్తిస్తారు. గుణాలను దిద్దుకొనే సాధనే ధ్యానం.

నిన్ను నీవుగా మాత్రం చూసుకోకూడదు. ఎవరైతే సృష్టించారో వారిని దృష్టిలో పెట్టుకో. ఎన్ని గొడవలలో ఉన్నా వాటి నుంచి బయటపడడానికి భగవంతుడు మనకు నిద్ర ఇచ్చాడు. నిద్ర రాకపోతే డాక్టరు నిద్రమాత్ర ఇస్తాడు. అలా వచ్చే నిద్ర నాచురల్ కాదు. మనకు విశ్వాసం ఆరూఢమైతే మనం ఎక్కడ ఉంటాం? ఆయన పాదాల దగ్గరే ఉంటాం. ఆ స్థితి పొందటానికి ధ్యానం ఒక పద్ధతి.

'అరమరయులేక నన్ను హరిచెంతకు చేర్చినారు'. గురుదేవులు మనకు ఎన్నో తెలిపారు. మూడు గుణాల్ని మొదలంటా నరికారు. అట్టి గురుదేవులు మరచినను మరపురారు. వారు మహానుభావులే. ఇంట్లో ఉంటే ఇల్లు కనిపిస్తుందా. ఇల్లు చూడాలంటే బయటకు వెళ్ళి చూడాలి. అది భిన్నత్వంగా ఉంది. ఇంట్లోనే ఉండాలి. మన గురుదేవులు మంచివారు. ఆ మంచే మీరు కావాలి. అంటే **బ్రహ్మైవాహం** అనే ప్రవృత్తి కలగాలి. దానికి గురుకృప అవసరం. మనం ఎల్లప్పుడు మననం చేయాలి. మనసులో ఉన్న మాలిన్యాన్ని రహితం చేసికోవాలి. మమకారం తొలగించుకోవాలి. గురుబోధను మననం చేసికోవాలి. దానికి గురుదేవులు చెప్పారు. ఆనపచేనులో పడ్డ దొంగ ఆవు గబాగబా మేసి చెట్టు క్రిందకు వెళ్ళి పడుకొని నెమరువేసినట్లుగా, మననం చేయాలి.

మనకి గురుదేవులు తెలియ చేసిన వేదాంతం అనుష్ఠాన వేదాంతం. వాచా వేదాంతం కాదు. శబ్దం ద్వారా వినాలి. ఆచరించాలి గాని చెప్పటం కాదయ్యా. చేసి చూపించటంతో పాటు అనుభవాన్ని పొందాలి. వాచా వేదాంతం కూడదు. ఇది లోకాభిరామాయణం కాదు. ఆధ్యాత్మ రామాయణం. ఏదైతే చైతన్యంగా ప్రకాశిస్తోందో అదే గురుదేవుడు. వారి పాదాశ్రయం చేస్తే జన్మలు లేకుండా చేస్తారు. అది మన మహద్భాగ్యం. **గురోరన్యం న భావయేత్** - గురువు తప్ప ఇతరమేదీ లేదు అని పూర్ణతః అనుభవం పొందినవాడికి ఇంక తెలుసుకోవలసిన జ్ఞానం లేదు. జ్ఞానం పొందే ఉన్నావు. కాని మరుపు అనేది అడ్డు వచ్చింది. గొలుసు పోయిందని వెతుకుతున్నావు. అది నీ మెడలోనే ఉందిరా- అని గురువు గుర్తు చేస్తాడు. నిధి వెతికితే నీ దగ్గరే ఉంది. నిజ నామం జపించరా -అంటాడు గురుదేవుడు. అది పుస్తకాలలో దొరికేది కాదు. అందరికీ ఒకే విధంగా ఉండదు గురుదేవుల ఉపదేశం. నీ శరీర తత్త్వానికి ఏమందు పడుతుందో చూసి ఇస్తారు. అలాగే రామదాసు తారకమంత్రం తీసికొన్నాడు - **తారకమంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా!** కబీర్‌దాస్ వచ్చి నామ్ దాన్ దియా - తారకనామాన్ని రామదాసుకి ఉపదేశించేశాడు. మంత్రాక్షరాలు అందరికీ తెలిసినవే. కాని గురు ముఖతః సాధకుడికి తగినట్లు వారి తపోశక్తిని మేళవించి మనలో ప్రవేశ పెడతారు. గురూపదేశం తీసుకొన్నవారు దానిని మననం చేయండి. గురుదేవులు ఏ ముద్రలో ఉన్నారో అది ఊహించుకోండి. తప్పు చేస్తే 'ఫో' అన్నా అంతకంటే ఎక్కువ ప్రేమ చూపేవారు.

దానికి ఒక దృష్టాంతం - ఒక పెద్ద కులస్థుడు పశువులను మేపుతూ అడవిలో ఒక ఆశ్రమంలో పాఠం వల్లె వేస్తుంటే ఆశ్రమానికి పెద్ద అయిన ఒక మహాత్ముని దర్శనం అయింది. ఆ మహాత్ముని క్రీగంటి చూపు అతనిపై ప్రసరించింది. అయితే అక్కడ ఉన్న శిష్యులు మాత్రం దేహాన్ని, వర్ణాశ్రమాన్ని దాటలేదు. ఇతనిని చూచి 'వాడి ముఖం వాడికేమి తెలుసు' అన్నట్లుగా చూశారు. కాని సర్వసాక్షి చూస్తూనే ఉంటాడు. గురువుగారు అతనిని 'ఛీ!ఫో!' అని లోపలికి వెళ్ళారు. శిష్యులు సంతోషించారు. పశులకాపరికి మాత్రం అది మాహామంత్రమైంది. దానిమీద విచారణ చేశాడు. మర్నాడు తిరిగి వచ్చాడు.

-సశేషం

# మాతాజీ బోధామృతం

- శివ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

(2009 శరన్నవరాత్రులలో ది 28-9-09 నాడు శ్రీమాతాజీ ప్రబోధమునకు సంక్షిప్త రూపం)

రాజుగారి కోట కు రక్షణకు ప్రాకారాలు ఉన్నట్లు, అమ్మ పంచకోశాలను పెట్టుకుంది. మొదటిది అన్నమయకోశం. ఇది స్థూల శరీరానికి, ఆకలి దప్పులకు సంబంధించినది. రెండవది ప్రాణమయకోశం. ఇది వాయువుకు సంబంధించినది. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులుగా హృదయస్థానంలో ఉన్నది. వాయువును పీల్చుకోగానే అది ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువుగా మారుతుంది.

ప్రాణవాయువు వలన హృదయం కొట్టుకుంటుంది. అపానం విసర్జనకు పనికివస్తుంది. వ్యానము అన్నింటికి ఆహారాన్ని సమానంగా పంచుతుంది. ఉదానం గొంతులో ఉంది మాట్లాడటానికి సహాయం చేస్తుంది. సమానం నాభిస్థానంలో ఉంటుంది. వీటికి అయిదు ఉపవాయువులు ఉన్నై. ఇవన్నీ మనలో ఏది ఉంటే ప్రకాశిస్తున్నై? నీవు ఏం చెయ్యాలన్నా, నీ ఎడమ చేతిని స్వామి పాదాల మీద ఉంచి, కుడిచేతితో పని చేసుకొని, పని కాగానే మళ్ళీ ఆ కుడిచేతిని కూడ స్వామి పాదాల యందు ఉంచాలి.

మూడవది మనోమయ కోశము. ఇందులో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం ఉంటాయి. ఇది సంకల్ప వికల్పాలతో కూడి సూక్ష్మ శరీరానికి సంబంధించి ఉన్నది.

నాలుగవది ఆనందమయకోశం - ఆనందం మన స్వరూపమై ఉన్నది. ఇది కారణ శరీరానికి సంబంధించినదై ఉన్నది. అయిదవది జ్ఞానమయ కోశం - ఇది మంచి, ఇది చెడు అనే నిర్ణయం తీసుకుంటుంది.

దేనిని ఆశ్రయించి మనం మన జీవిత రహస్యాన్ని తెలుసు కుంటున్నాము?

**పంచ కోశాంతరస్థితా, పంచమ్యై నమః, పంచసంఖ్యోపచారిణీ**. అమ్మ ఇచ్చాను అనుకోదు. అమ్మకు తనకన్న భిన్నమైంది ఉంటే కదా! నీవు ఉంటేనే నీకు ప్రపంచం తెలుస్తున్నది. దేవుడు చూసి, చూసి, వాడిలో దాక్కుంటేనే వాడు లోపలికి వెతుక్కోడు కనుక నన్ను కనుక్కోలేడు అని మన లోపలే దాక్కున్నాడు.

**పంచభూతేశీ** - పంచభూతములంటే, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి. వీటిని సృష్టి చేసి అమ్మ మనకు ఏ సమయానికి ఏం కావాలో అది అందిస్తున్నది. మనం దానిని మరచి, ఒళ్ళు దగ్గర పెట్టుకోక, మనమే ఏదో చేసేస్తున్నాము అని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాము.

మా అమ్మ చేసిన మైసూరు పాకు అంతా నాకే అని అంతా మనమే లోపల వేస్తే, నాలిక దాటగానే, దాని రూపం మారి, సుగర్ పేషెంట్లకు రక్తంలో సుగర్ ఎక్కువ అవుతుంది. అందుకని జాగరూకతతో మన జీవితాన్ని నడిపించుకోవాలి. ఇందులో ఉన్న నిజతత్త్వాన్ని గుర్తిస్తే అంతటా ఉన్న భగవంతుణ్ణి గుర్తిస్తాము.

భగవంతుణ్ణి గురించి మహారాజు అడిగిన ప్రశ్నలకు పండితుడికి సమాధానం దొరకలేదు. శిరచ్ఛేదం తప్పదని దిగులు పడ్డాడు. అన్నం నీళ్ళు మానేశాడు. చావు స్మరణలా కాకూడదు. నేను బ్రతుకుతాను అనుకుంటే ఇంకా కొన్నాళ్ళు బ్రతుకుతాడు. నిద్రాహారాలు మానేస్తే వచ్చేది కాదు అది.

ఆయన వద్ద ఒక నమ్మిన బంటు ఉన్నాడు. అతడు పండితుడు దిగులుగా ఉండటం చూసి కారణం చెప్పమని అడుగుతాడు. నాకు చెప్పండి, నాకు చేతనైతే, మీ దిగులుకు కారణం చేస్తే దానిని తీరుస్తాను అంటాడు. పండితుడు మహారాజు నన్ను కొన్ని ప్రశ్నలడిగాడు. సమాధానం చెప్పకపోతే తల తీసేయిస్తానన్నాడు. గడువు కూడా పెట్టాడు. సమాధానాలు నాకే తెలియలేదు, ఇంకా నీకేం తెలుస్తుంది? అంటాడు. కాదు ఆ ప్రశ్నలు ఏమిటో చెప్పండి అని ఆ నమ్మిన సేవకుడు వదలకుండా పట్టుపట్టాడు.ఆయన ప్రశ్నల సంగతి చెప్పి. ఇంకా రెండు రోజులే గడువు ఉంది. ఆ తరువాత నాకు శిరచ్ఛేదమే అంటాడు. సేవకుడు ప్రశ్నలు విని, ఓస్ ఇంతే కదా! మీ కెందుకు? మీరు నిశ్చింతగా ఉండండి. నేను రాజాస్థానానికి వెళ్ళి సమాధానాలు చెప్పి వస్తాను కదా! ఇక లేచి హాయిగా భోజనం చేయండి అని పండితుడికి భరోసా ఇస్తాడు. తీరా వెళ్ళి నీవు సమాధానాలు చెప్పలేకపోతే నీకు శిరచ్ఛేదం చేస్తాడు ఆ రాజు, నీ కెందుకురా? అని హెచ్చరిస్తాడు పండితుడు. సేవకుడు మీరు నిర్భయంగా ఉండండి. నేను సమాధానాలు చెప్పి వస్తానుగా అన్నాడు.

మర్నాడు అతడు రాజాస్థానానికి నడచి వెళ్ళాడు. అతడి వాలకం చూసి ద్వారపాలకులు అడ్డగించారు. అతడు ద్వారపాలకులతో ఫలానా పండితుడు పంపితే, రాజుగారి ప్రశ్నలకు సమాధానం చెప్పటానికి వచ్చాను

అంటాడు. అతనిని సభలో ప్రవేశ పెట్టారు. నేను మీ ఆస్థాన పండితుల దగ్గర సేవ చేసుకొనే వాణ్ణి. తమరు వారిని ఏవో ప్రశ్నలు అడిగారట. ఆ మాత్రం ప్రశ్నలకు మా పండితులుగారెందుకు అని నేనే సమాధానాలు చెప్పటానికి వచ్చాను అన్నాడు. మహారాజుగారు షరతులు తెలుసా? అని అడిగారు. "తెలుసు, చెప్పలేకపోతే శిరచ్ఛేదం. అంతే కదా!" రాజుగారు అయితే తెలిసే వచ్చావన్న మాట అంటారు. సేవకుడు భయమెందుకు, సమాధానాలు దగ్గర ఉన్నప్పుడు అన్నాడు. సాధకుడు నా గురుదేవులు నాకున్నారు అని అలా ధైర్యంగా ఉండాలి.

సేవకుడు ప్రశ్నలు అడగండి అన్నాడు. రాజుగారు అడిగారు. భగవంతుడు ఎటు చూస్తుంటాడు? భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? భగవంతుడు ఏం చేస్తున్నాడు? సేవకుడు మహారాజా! ఒక పాత్రలో పాలు తెప్పించండి. అలాగే ఒక లాంతరు తెప్పించండి. మహారాజా! మీకు తెలియనిది కాదు, చెప్పేవాడు పైన కూర్చోవాలి, వినేవాడు క్రింద కూర్చోవాలి అన్నాడు. పాలు లాంతరు వచ్చినై. రాజుగారు సేవకుడికి తన ఉన్నతాసనం ఇచ్చి తాను క్రింద కూర్చున్నారు. ఊ ఇప్పుడు చెప్పు సమాధానాలు అన్నారు.

సేవకుడు లాంతరు వెలిగించాడు. మహారాజా! ఈ లాంతరు కాంతి ఎటువైపు చూస్తున్నది అని అడిగాడు. రాజుగారు, కాంతి ఎటు చూడటమేమిటి? అంతటా చూస్తున్నది అన్నారు. సేవకుడు రాజా! దేవుడు ఎటు చూస్తున్నాడు అని అడిగారు కదా! ఇదిగో ఇలా అంతటా చూస్తున్నాడు.

మీ రెండవ ప్రశ్న దేవుడు ఎక్కడ ఉన్నాడు? అని. మహారాజా ఈ పాలలో వెన్న ఉన్నది. అది ఎక్కడ ఉన్నదో చెప్పగలరా? రాజుగారు ఎక్కడ ఏమిటి? పాలలో అంతటా ఉన్నది అన్నారు. మహారాజా భగవంతుడు కూడ, ఆ వెన్నలాగా కనిపించకుండా ఈ జగత్తు అంతటా వ్యాపించి ఉన్నాడు.

మహారాజా ఇక మీ చివరి ప్రశ్న భగవంతుడు ఏం చేస్తున్నాడు? అని కదా! మామూలుగా మీరు ఉన్నతమైన సింహాసనం మీద కూర్చొని ఉంటే, ఈ సేవకుడు ఎక్కడో ఒక మూల క్రింద కూర్చొని ఉంటాడు. అటువంటిది నన్ను పైన కూర్చోబెట్టి, మిమ్మల్ని క్రింద కూర్చో బెట్టాడు. భగవంతుడు రాజును క్రింద భటుణ్ణి పైనా ఉండేలా చేస్తూంటాడు అని సేవకుడు సమాధానం చెప్పాడు.

-సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

(గతసంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

గురుదేవులు సమాధానం చెప్తూ తల్లికన్నా తండ్రి, తండ్రికన్న ఆచార్యులు చెప్పింది ఉత్తరోత్తరం శ్రేష్ఠమైనది. ప్రహ్లాదుడు తల్లిగర్భంలో ఉండగానే అతడు తన గురుదేవులైన నారదుని ద్వారా నారాయణ మంత్రం ఉపదేశం పొందాడు. అంతే కాదు సాధనచేసి సర్వేసర్వత్రా ఆ నారాయణ స్వరూపం దర్శించాడు. అందువలననే ప్రహ్లాదుడు అంతటి మహాభక్తుడైనాడు. ప్రహ్లాదుడు హిరణ్య కశిపుడితో 'అదేమిటి తండ్రీ! అలా ఎలా అనగలుగుతున్నావు? నేను ఒక్కసారి నారాయణ నామం పైకి అనే లోపల నీవు ఆ నారాయణుడిని లోపల పదిసార్లు తలచుకుంటున్నావు. కాని ఏమి లాభం? నీకు విశ్వాసం లేదు. ఉంటే నీకు ఆ స్వామి సాక్షాత్కారం ఎప్పుడో కలిగి ఉండేది'' అన్నాడు. హిరణ్యకశిపుడిది వైరభక్తి. నవ విధభక్తులలో చెప్ప బడని భక్తులు ఇంకా ఉన్నై. వాత్సల్యభక్తి, నిరీక్షణ భక్తి వంటివి. భగవంతుడు బాలరాముడుగా, బాల కృష్ణుడుగా వస్తే ఎంత బాగుంటుంది?

(శ్రీ మాతాజీ బాల ముకుందా జైనందలాలా కృష్ణ కన్నయ్యా జై గోపాలా అని మధురంగా తాము సంకీర్తన చేస్తూ అందరితో చేయించారు.) బాల, బాల అని తలచుకొనే సరికి, నీ అర్చామూర్తులు నీ మనోనేత్రం ముందు ఆ బాలరూపంలో దర్శనం ఇస్తారు. ఇక్కడ ఉన్న హనుమంతుడి మూర్తి చాల పెద్దదిగా ఉన్నది. కాని బాల హనుమంతుడు? హనుమంతుడు ఎలా ఉంటాడు? సూర్యుణ్ణి మ్రింగటానికి ఎగురుతున్నట్లుగానో, సముద్రాన్ని దాటటానికి ఎగురుతున్నట్లుగానో, సంజీవ పర్వతాన్ని పెకలించుకొని రావటానికి పోతున్నట్లో ఉంటాడు. ఇక్కడ ఇద్దరు హనుమంతులు ఉన్నారు. మధ్య మనం ఉన్నాము.

ఆ ఆంజనేయ స్వామి నిరంతరము ఆ సీతారాముల సేవలో ఉంటాడు. అందువలననే ఆయన భక్తి శక్తిగా అయింది. భక్తి శక్తి కావాలి. అభయమిచ్చే శక్తి కావాలి. రక్షించే శక్తి కావాలి. ఒక భక్తుడు ఇసుకలో నడచిపోతూ క్రింద చూసుకుంటే అతడికి రెండు జతల పాదాల గుర్తులు కనిపించాయి. అతడు ఆశ్చర్యపోతూ ముందుకు సాగాడు. కొంతదూరం పోయాక చూస్తే క్రింద ఒక్క జత పాదాల గుర్తులే కనిపించాయి. అతడు ఆశ్చర్యపోతూ ముందుకు సాగాడు. కొంత దూరం పోయాక చూస్తే మళ్ళీ రెండుజతలపాదాల గుర్తులు కనిపించాయి. ఇట్లా కొంత సేపు రెండు జతలపాదాల గుర్తులు,

కొంత సేపు ఒకే జతపాదం గుర్తులూ కనిపించాయి. కొన్నాళ్ళ తరువాత అతడికి భగవత్సాక్షాత్కారం కలిగితే అతడు భగవంతుణ్ణి దీనిని గురించి అడిగాడు. భగవంతుడు నేను ఎప్పుడూ నీ వెనకే ఉండి నిన్ను రక్షిస్తున్నాను అని చెప్పాడు. మనము మన మనస్సును ఎడముఖం పెడముఖంగా పెడితే మనకు భగవద్భక్తి ఎలా కలుగుతుంది? ఆ భగవంతుడు ఎందుకు రక్షిస్తాడు? నీకు రెండు జతల పాదాల గుర్తులు కనిపిస్తే ఆశ్చర్యంగా చూశావే, అవి ఎవరివనుకున్నావు? అందులో ఒక జత నీది, రెండవ జత నాది అని చెప్పాడు భగవంతుడు. అప్పుడు భక్తుడు అడిగాడు "మరయితే కొన్ని సమయాలలో ఒక జత గుర్తులే ఉన్నాయి కదా? మరి అప్పుడు నీవేమైనావు?'' భగవంతుడేమన్నా తక్కువ తిన్నాడా? ఆయన చెప్పాడు "ఆ జత నా పాదాల గుర్తులే నాయనా! అవి నీ పాదాల గుర్తులు కాదు. అప్పుడు నీవు కష్టాలలో ఉంటే నేను నిన్ను ఎత్తుకొని నడిచాను.''

మనకు ఏ కష్టాలు వచ్చినా రక్షించేవాడు ఆ భగవంతుడే. నీకు నిద్రరాక పోతే భగవన్నామం చెయ్యి, నీకు నిద్ర పడుతుంది. కష్టాలు వస్తే భగవన్నామం చెయ్యి. నిన్ను భగవంతుడు రక్షిస్తాడు. ఇప్పుడు ఈ పాడు ఫోన్లు వచ్చాయి. లోకాభిరామాయణంతో రోజంతా గడిచి పోతుంది. అలాంటప్పుడు ధ్యానం కుదరమంటే ఎలా కుదురుతుంది? కుదరదు. మరి ప్రహ్లాదుడికి ఎలా కుదిరింది అంటే అతడు గురూపదేశం పొందాడు.

హిరణ్య కశిపుడు అతడిని కొండల మీద నుంచి త్రోయించాడు. సముద్రంలో పారవేయించాడు. ఏనుగులతో త్రొక్కించాడు. పాములతో కరిపించాడు. కాని ప్రహ్లాదుడికి మాత్రం నారాయణుడు తప్ప అన్యమైనది ఉన్నది అన్న భావన కలగలేదు. **నద్వితీయోస్తి కశ్చిత్** (నారాయణోపనిషత్తు). అందుకే అతడు నిర్భయంగా నిలబడ్డాడు. అతడు అలా నిర్భయంగా నిలబడేటప్పటికి, హిరణ్య కశిపుడు వీడిలో ఏమి శక్తి ఉన్నదబ్బా! ఎన్ని కష్టాలు పెట్టినా లొంగలేదు, ఇప్పుడేం చెయ్యాలి? అని ఆలోచిస్తుంటే అంతలో నారదుడు వస్తాడు. అతడు హిరణ్య కశిపుడితో "నీవు నారాయణుడు వైకుంఠంలో లేడు అంటున్నావు. ఎక్కడా కనిపించటం లేదు అంటున్నావు. అహ 'ఇది నా ఊహ మాత్రమే సుమా!' అయినా చెప్తే ఏమౌతుందో ఏమో నాకెందుకులే'' అంటాడు. హిరణ్య కశిపుడు చెప్పు నారదా! అని బలవంతం చేసిన తరువాత నారదుడు 'ఒక వేళ.... ఒక వేళ ఆ నారాయణుడు అక్కడ అయితే నీవు వెతకవు అని, ఈ ప్రహ్లాదుడిలో దాక్కోలేదు గదా? అని

ఊదుతాడు. వెంటనే హిరణ్య కశిపుడు 'ఔను నారదా! సందేహం లేదు. ఆ హరి ప్రహ్లాదుడిలో తప్పక దాక్కొని ఉన్నాడు. అందుకే ఏమి చేసినా వీడు చిరునవ్వుతో చిరంజీవిగా తిరిగివస్తున్నాడు' అని ప్రహ్లాదుడితో, నీవు నమస్కరిస్తున్న ఆ నారాయణుడు ఎక్కడ ఉన్నాడో చూపించు అన్నాడు. ప్రహ్లాదుడు చిరునవ్వుతో -

ఇందు గలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండెందెందు వెదకి చూచిన అందందే కలడు దానవాగ్రణి కంటే అన్నాడు. నారాయణుడు సర్వదేవతా స్వరూపుడు. సర్వాధిష్ఠానము, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు. చక్రి సర్వోప గతుడు. ఆయన లేనిది ఒక్క పురుగుకూడ ఉండలేదు. జడం కూడ ఉండలేదు. ఇక చైతన్యంలో ఎంతో విశేషంగా ప్రకాశిస్తాడు. చక్రి సర్వోప గతుడు. చక్రి అందరి లోపల ఉన్నవాడు. లోపల ఉన్నవాడు ఎలా కనిపిస్తాడు? వెదకి చూడాలి. ఏది ఉండ బట్టి సృష్టి ఇన్ని విధాలుగా జరుగుతున్నదో, అది లోపలే కాక బయటకూడ ఉన్నది. కాని అది ఈ ఇంద్రియములకు కనిపించదు. మన మనస్సు ఆ భగవంతుణ్ణి చూడగలిగితే దైవత్వాన్ని అనుభవిస్తుంది. దేవుడి ముందుకు వెళ్ళి, నమస్కారం పెట్టి మనం ఒక్క క్షణం కళ్ళు మూసుకుంటాము ఎందుకు? ఆ దేవుడు ఇక్కడ అంటే లోపల కూడ ఉన్నాడు అనటానికి గుర్తు.

**రే! రే! సర్వం బ్రహ్మమయం**
**కిం వచనీయం? కిమవచనీయం? ॥రే! రే!॥**
**కిం రచనీయం? కిమరచనీయం? ॥రే! రే!॥**
**కిం పఠనీయం? కిమపఠనీయం ? ॥రే! రే!॥**
**కిం భజనీయం? కిమభజనీయం? ॥సర్వం॥**
**సర్వత్ర సదా హంస ధ్యానం**
**కర్తవ్యం భో! ముక్తి నిధానం ॥సర్వం॥**

అంతటా వ్యాపించి ఉన్నది ఒకే శక్తి. అది మనలో ప్రాణ రూపంలో ఉన్నది. దానిని ఎవరైనా తీసి చూపగలరా? పోనీ డాక్టర్లు చూపగలరా? అన్నీ సవ్యంగా జరిగితే తమ గొప్ప అంటారు. కాస్త అటూ ఇటూ అయితే, లేటుగా తీసికొని వచ్చారు అంటారు. కాని మహాత్ములు అలా ఎప్పుడూ అనలేదు. వారు ఎంతో కరుణరసం ఉట్టిపడేలా మాట్లాడతారు. ఎంతో తీవ్రమైన మొండి వ్యాధులనైనా, భగవంతుని ప్రార్థనతో, తీర్థంతో నయం చేస్తారు. అస్మద్గురు దేవులు ప్రాణం పోయిన వారికి తిరిగి ప్రాణం పోసిన ఉదాహరణలు ఎన్నో!

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

**"అప్రత్యక్షో మహాదేవో, సర్వేషాం ఆత్మమాయయా ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే."**

దేశమంతటా విశేష శ్రద్ధాభక్తులతో జరుపుకొనే హిందువుల ప్రధాన పర్వదినం మహాశివరాత్రి. మతపరంగా, పురాణాల పరంగా ఈ పర్వానికిగల విశిష్టత అందరికీ తెలుసును. కాని శివరాత్రి గురించి "తాత్త్విక విషయాలు" అంతగా తెలియవు. శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాదబాబు ఆత్మోపలబ్ధికి - శివరాత్రి పర్వం ఎంతగా దోహదం చేస్తుందో ప్రత్యేకించి హితవు చెపుతున్నారు. ఆడంబరాలతో కూడిన 'జాగరణ' కన్న సద్గురు శరణాగతి, శివత్వ సంసిద్ధి శివరాత్రి పర్వం ఇచ్చే దివ్యసందేశాలని ఆయన అంటున్నారు. నంబూరులోని శ్రీ కాళీగార్డెన్స్‌లో దివ్య గంభీర వాతావరణంలో జరిగే శివరాత్రి ఉత్సవ విశేషాలు ప్రత్యేకించి పేర్కొనదగినవి.మానవ జీవితంలో దివారాత్ర చక్రభ్రమణం అనివార్యం, సర్వసాధారణం. అయితే ఇటువంటి లక్షల రాత్రులలో 'శివరాత్రి' అసాధారణం అయినది. మహాశివరాత్రి పేరులోనే గంభీరమైన అర్థం ఉన్నది. ఇది ఆధ్యాత్మిక ప్రాధాన్యంగల అర్థం. శివశబ్దానికి పవిత్రత, శుభప్రదం అనే అర్థాలున్నాయి. అందుకే 'మహా శివరాత్రి' అంటే పవిత్రమైన, శుభప్రదమైన రాత్రి అని అర్థం. అహంకారపూరితమైన తామసరాత్రులకు చరమ (ఆఖరి) రాత్రిగా ఈ మహా శివరాత్రిని సంభావించవచ్చును.

అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి జ్ఞాన దీపాన్ని వెలిగించే ఉజ్జ్వల పర్వదినం ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే 'దివ్య కాంతి' ప్రసాదించేది శివరాత్రి. అందుకే ఇది నిరుపమానమైనది. రాత్రి, నిద్ర సహచరులు. మృత్యువుకు మరో రూపం నిద్ర. అంటే ఇంద్రియాలన్ని చైతన్యాన్ని కోల్పోయే సమయం అది.

అయితే మనలోని ఆత్మను లేదా శివుణ్ణి గుర్తించే వరకు జీవితం అంతా అంధకారమయమే. కనుక శివతత్వానుభూతియే జీవితాన్ని అర్థవంతం చేస్తుంది. శ్రీ కాళీ వరప్రసాద బాబు ఇక్కడ అచ్చ తెలుగు సామెతను ఉదహరిస్తారు. 'జన్మకొక శివరాత్రి' అని. మనిషి తన జీవిత కాలంలో ఎన్నో శివ రాత్రులు చూస్తున్నప్పుడు ఈ మాట హాస్యాస్పదంగా తోచినప్పటికీ, ఈ మాట వెనుక తత్వార్థం ఇమిడి ఉన్నదని ఆయన ఉద్బోధిస్తున్నారు. సాధారణ దృష్టికి శివరాత్రి ప్రతి ఏడాది వచ్చే పర్వదినం. ఇది సర్వత్రా సంరంభం కానవచ్చే ఘట్టమే, కాని నిజమైన భక్తుడు, తత్త్వ సాధకుడు ద్వైధీ భావాన్ని అధిగమించి, శివునితో తాదాత్మ్యం చెందినవాడు ఒక్కసారి మాత్రమే శివరాత్రి జరుపుకొంటాడు. అహంకారాన్ని, రాగద్వేషాలను జయించి సద్గురువు చెంతనే శివసాన్నిధ్యంలోనే

తనను తాను సర్వసమర్పణ చేసుకొనే వరకు ద్వైధీభావం అంతరించదు. ద్వందాతీతుడు కానంత వరకు జీవితంలో నిజమైన శివరాత్రిని జరుపుకొనలేడు. అటువంటి "శివంకరత్వా''న్ని సాధించనంత వరకు జరుపుకొనే రాత్రులన్నీ 'శవరాత్రులే' అవుతాయి. అవి మృతప్రాయమైన రాత్రులు. శివరాత్రి రోజున జాగరణ చేయడం అందరికీ తెలిసిన విషయమే. అంటే కేవలం భౌతికంగా మెలకువగా ఉన్నంత మాత్రాన పవిత్రత రాదు. కాని ఇటువంటి పర్వాల అంతరార్థాన్ని అవగతం చేసుకొని ఆచరించడంలో మనం విఫలురం కావడం దురదృష్టకరం. ఈ రోజున జాగరణం చేయడంకోసం ఎంతో గొడవచేస్తుంటాం. వానికి ప్రత్యేకత ఏమీ లేదు. కేవలం మెలకువగా ఉన్నంత మాత్రాన చాలదు. అరిషడ్వర్గాల నుంచి విముక్తులమై శక్తివంతమైన శివనామస్మరణతో, తత్త్వారాధనం చేయడం ముఖ్యం. అప్పుడు మాత్రమే ఇది శుభంకరమైన రాత్రి అవుతుంది. శివ నామామృత పానంతో నిన్ను నీవు పునీతం చేసుకొన్న శివరాత్రి అవుతుంది. కలుషిత భావాల నుండి మనస్సు దూరం అవుతుంది. అసలైన సాధకుడు ఇటువంటి జాగరణ చేసి, ఉపవాసంతో శివరాత్రి జరుపుకోవాలి. విశ్వవ్యాప్తుడైనప్పటికీ అదృశ్యరూపంలో నీకు సాక్షాత్కరిస్తాడు. అప్పుడు మాత్రమే నీవు ఈ మాయాబంధాల నుండి విముక్తుడవై విశ్వాసాన్ని, ఆరాధనను, పెంపొందించుకొనగలుగుతావు.

శ్రీ కాళీగార్డెన్సులోని ఆస్తికులు శ్రీబాబుగారికి సహస్ర ఘటాభిషేకం చేయడం ద్వారా శివారాధనం జరుపుతారు. ఆయన మందహాసంతో అభయముద్రాంకితులై సర్వసమభావంతో అందరినీ ఆశీర్వదిస్తారు.

అభిషేకానంతరం సద్గురు పూజాకార్యక్రమం జరుగుతుంది. సద్గురు రూపంలో ఇలా శివారాధన చేయటం ఒక సువర్ణావకాశం. ఈ కార్యక్రమంలో నీటిని అభిషేకం చేయడం మనోమాలిన్యాల క్షాళనకు సంకేతం. మలిన రహితమైన శరీరం పరమేశ్వర నివాసస్థానం.

ఈ కార్యక్రమాన్ని ఎవరికి వారు చూసి దివ్యానుభూతి పొందవలసిందే తప్ప వర్ణించడం కష్టం. శివత్వ సిద్ధిపొందిన రాత్రి మాత్రమే జీవితంలో దివ్యమైనది, సుందరమైనది. అయితే సద్గురువు మార్గదర్శనంలో ప్రతివారూ తమ యావజ్జీవితాన్ని 'శాశ్వత శివరాత్రి'గా పండించుకొనగలుగుతారు. అందుచే సర్వులూ సంరంభపూరితమైన 'శివరాత్రి'కి బదులు 'దివ్య శివరాత్రి'ని అవాహన చేసుకొన వలసినదని శ్రీ బాబుగారు చెప్పే హితవచనం. *

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

అప్పటికి ఊరుకున్నా, విక్రమ దేవ వర్మగారు, శ్రీబాబు వచ్చినప్పుడల్లా ఆ ప్రస్తావన తెచ్చేవారు. శ్రీబాబు "తమరు మాటి మాటికి ఆశ్రమ ప్రస్తావన తెస్తుంటే, నేను యిక యిక్కడికి రాను. అలా కాక నేను చెప్పినట్లు మీరు ఆచరించుకోగలిగితే, నాకు ఆనందమూ, మీకు జన్మ చరితార్థతా రెండూ కలుగుతాయి"అని దృఢంగా చెప్పారు. శ్రీవిక్రమ దేవ వర్మగారు శ్రీబాబు ఆజ్ఞానుసారంగా ఎన్నో విద్యాలయాలకు, వైద్యశాలలకు, అనేక యితర ధర్మ కార్యాలకు తమ అపార సంపదను వినియోగించి సార్థక జన్ములైనారు.



తమ సాధన కొనసాగిస్తుండగా, అష్ట సిద్ధులూ తమంతట తామే శ్రీబాబును వరించి వచ్చాయి. కాని కేవలము ఆత్మసాక్షాత్కారమే లక్ష్యంగా పెట్టుకున్న శ్రీబాబు ఆ సిద్ధులను ప్రదర్శించే ప్రయత్నం చేయక వాటిని దూరంగా ఉంచారు. తమ బాల్యంలో తోటి బాలురతో ఆడుకొనే సమయంలో మాత్రం వాళ్ళకు సరదాగా చిన్ని చిన్ని తమాషాలు చేసి చూపించేవారు. భూత, భవిష్యత్, వర్తమాన విషయాలు వ్యక్తులను సక్రమ దైవ చింతనలో పెట్టటం కోసం మొదట్లో చెప్పేవారు కాని, అది కొద్దిమందికి మనస్తాపం కలిగించిందని తెలిసి, అలా చెప్పటం విరమించుకున్నామని చెప్పారు.

జనాకర్షణ కోసం మహిమలు చూపటం, వారిని తప్పుదోవ పట్టించటమేనని శ్రీబాబు అనేవారు. మహిమల ద్వారా బాధానివారణ పొందటం మానవులకు అలవాటైతే , ఇక పూజలు, సాధనలు అవసరం లేకుండా సోమరులై, మహిమల ద్వారానే, తమ జీవిత సమస్యలన్నీ పరిష్కారం కావాలని కోరుకోవటం మొదలు పెడతారు. భగవచ్చింతన లోపించిన మనస్సు ఎన్నటికీ శుద్ధ సాత్విక ప్రవృత్తిని పొందలేదు. అర్హులైన వారికి తక్షణ ఉపశమనం కలిగించడానికి శ్రీబాబు సమర్థులై ఉండి కూడా, వారికి ఏవో పూజలో, దీక్షలో చెప్పి భక్తి శ్రద్ధలతో ఆచరింపజేసి, సుఖ శాంతులు కలిగించేవారు. అది

జగన్మాత కృప వల్లనే అని చెబుతూ, వారిలో భగవద్భక్తిని, తత్త్వ చింతనను పాదు కొలిపే వారు.

మహిమలు చూపటం, లీలలు జరపటం అన్న మాటలు మహాత్ముల విషయంలో ఎన్నడూ వర్తించవు. వారు సర్వ సమర్థులై ఉన్నా, సర్వదా సాక్షి మాత్రులే. అయితే వారు కరుణా సముద్రులు. ఏ ప్రాణి అయినా ఆపదలో ఉన్నపుడు , లేదా భరించరాని దుఃఖంలో మునిగి ఉన్నపుడు, మహాత్ముల మనస్సు జాలితో ద్రవిస్తుంది. ఆ సమయంలో మహిమలేమిటి , లీలలేమిటి, అద్భుతాలే వాటంతట అవి జరిగిపోతాయి. సాధువులకు, సజ్జనులకు, భక్తులకు, ప్రాణ, మాన, హాని జరుగకుండా, ధర్మ గ్లాని కలుగకుండా నివారించటమే గదా అవతార లక్ష్యము ! దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు, జగన్నాటక లీలకు తాను కర్తవలె కనిపిస్తున్నా, అకర్తనని, కేవలము సాక్షిని మాత్రమే అని శ్రీ గీతాచార్యుడు తన గీతా సందేశంలో స్వయంగా ప్రకటించుకున్నాడు.

శ్రీబాబు కొన్నాళ్ళు ప్రతిరోజూ గుంటూరు నుండి విజయవాడకు నడచి వెళ్ళి వస్తూ ఉండేవారు. విజయవాడలో శ్రీకనక దుర్గా మాత దర్శనం చేసుకొని, కృష్ణానది బ్రిడ్జి క్రిందకు వెళ్ళి కూర్చుని తపస్సు చేసుకొనేవారమని చెప్పారు. శ్రీబాబు తమ సాధనను కొనసాగిస్తూనే వివిధ మత సంప్రదాయాలను గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా సాంప్రదాయాలలో పెద్దలు, పండితులు అయిన వారితో సాంగత్యం చేసి, భగవత్తత్త్వముపై వారి భావాలను, సాధనా పద్ధతులను, వారి అనుభవ విశేషాలను గూర్చి తెలుసుకునేవారు. వైష్ణవ మత సాంప్రదాయాలను గూర్చి తెలుసుకోవలెనని, కొన్నాళ్ళు తిరుపుండ్రములు ధరించి వైష్ణవ పండితులతో సాంగత్యం చేశామని చెప్పారు.

ఒకసారి సాధువులు కొందరు ఒక సత్రంలో కూర్చొని, సన్యాసి లక్షణాలను గూర్చి తీవ్రంగా చర్చించుకుంటున్నారు. అంతలో శ్రీబాబు అక్కడకు వచ్చి "అయ్యా! తమరు అనుమతిస్తే నా అభిప్రాయం చెబుతాను" అన్నారు. "ఈ కుర్రవాడా చెప్పేది" అనుకుంటూనే వాళ్ళు 'చెప్ప'మన్నారు. "మనస్సు సన్యసించటం ఒక్కటే సన్యాసికి ముఖ్య లక్షణం" అన్నారు శ్రీబాబు. ఆశ్చర్యానందాలతో వాళ్ళు శ్రీబాబును కౌగలించుకున్నారు.

శ్రీబాబు బాలునిగా ఉన్నప్పుడు పరిచయంగల పెద్దలు వృద్ధులై, మనుమలను, మునిమనుమలను ఎత్తుకున్న వారు, చాలా కాలం తరువాత శ్రీబాబును దర్శించినప్పుడు నవ యువకునివలె కనిపించిన శ్రీబాబును చూసి "వారు వీరేనా?" అని ఆశ్చర్యపోవటం ఎన్ని సందర్భాలలోనో జరిగింది.

శ్రీబాబుతో నడవడం అంటే పరుగెత్తటమే. వారితో బాటు నడిచి వెళ్ళేటప్పుడు, పల్లెటూళ్ళల్లో చిన్న చిన్న పంటకాలువలు, లేదా మురుక్కోళ్ళు (మురుక్కోడు అంటే మురుగు నీరు ప్రవహించే కాలువ) దాటవలసి వస్తే, శ్రీబాబు పంచెను పైకి కట్టి, ఒక్క దూకులో అవతలకి వెళ్ళేవారు. అందరిని అలాగే రమ్మనమనే వారు. లేకపోతే బాగా దూరం వెళ్ళి, అక్కడ చిన్న వంతెనో, అడ్డంగా వేసిన తాటి దూలమో చూసుకొని దాటాలి. ఈలోపల శ్రీ బాబు వెళ్ళి పోతారు. అందుకని సాహసించి, వెంట వచ్చిన వాళ్ళు కూడా పంచలెగగట్టి దూకబోయి నీళ్ళలో పడటమో, ముళ్ళు గుచ్చుకోవటమో జరిగేది. శ్రీబాబు ముందు పక పకా నవ్వేవారు. "ఈ మాత్రం దూకలేని వారు, ఎందుకయ్యా! ఆ రొయ్య మీసాలు పెంచటం? మూతి మీద ఈగ వాలినట్లుగా ఆ ఫ్రెంచి కటింగులు చేయించుకోవటం? వస్త్రాదులమంటారు, పేడని తంతే పదహారు ముక్కలవుతుంది కాబోలు" అని చాలాసేపు ఉడికించే వారు. తరువాత కొద్దిక్షణాలలో ప్రశాంతి కలిగించే వారు. ఆ అనుభవాలను చెప్పుకొని మురిసిపోయే వయోవృద్ధులు యీనాటికీ ఆశ్రమంలోనే ఉన్నారు (చంద్రయ్యగారు, సూర్యనారాయణరాజు గారు మొదలైన వారు).

హిమాలయాలలో గంగోత్రి, యమునోత్రి, బదరీనాథ్, హృషీకేశ్‌లలో, శ్రీబాబు బాల్యంలో కొంత కాలం తపస్సు చేశారు. అప్పుడు శ్రీబాబుతో ఉన్నవారు తమ అనుభవాన్ని ఇలా చెప్పారు. "హృషీకేశ్‌లో ధనికులైన మార్వాడీలు సాధన చేసుకునేవారి కోసం గదులు కట్టించి, అందులో ఉండి సాధన చేసుకోవటానికి వసతి కల్పించారు. ప్రతి రోజు వారి గదులలోకి రొట్టెలూ, పాలూ పంపే ఏర్పాటు చేశారు. చాలా మంది సాధువులు ఆ గదులలో ఉండి సాధన చేసేవారు. శ్రీ బాబు కూడా కొన్ని దినాలు అక్కడ ఒక గదిలో ఉండి ధ్యానం చేసుకొనే వారు. ధ్యాన సమయంలో వారికి ఆకలి దప్పికలు గాని, బాహ్య స్పృహ గాని ఉండేవి కావు. కాని ప్రక్క గదులలో ఉన్న సాధువులు కొందరు, మధ్యాహ్నం భోజన సమయం అయ్యేసరికి రొట్టె కోసం, పాలకోసం తహతహ లాడేవారు. గదులలో నుంచి వాళ్ళు బయటకు వచ్చి, "ఇంకా రొట్టె, పాలు తెచ్చి ఇవ్వరేమిటి?" అని గొడవ చేస్తుండేవారు. "ఇంట్లో ఉండి ఉంటే ఈపాటికి హాయిగా భోజనం చేసి ఉండే వాళ్ళం కదా! ఇలా వచ్చి పొరపాటు చేశాము" అన్న ఆలోచనలు కూడా వాళ్ళలో మొలకెత్తేవి.

-సశేషం



# శ్యామసుందరా! ఒక్కసారి! ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

ఆతడికి శ్వాస తీసుకోవటం భారంగా ఉంది... కొంచెం ఆగి కృష్ణుని వైపు చూసి నెమ్మదిగా ఇలా అన్నాడు "కృష్ణా! ఈ ఉత్తేజం... నా పరాజయం నన్ను వ్యాకుల పరిచింది అని బహుశ నువ్వు భావించవచ్చు కాని అది నిజం కాదు. కంసుడు విజయాన్ని ఎలా వరిస్తాడో అలాగే పరాజయాన్ని కూడా అంత సమానంగానే స్వీకరిస్తాడు'' అని అక్రూరుని వైపు చూసి ఇలా అన్నాడు "అక్రూరా! కంసమహారాజు ఇంకా జీవించే ఉన్నాడు. ఈ మధుర మహారాజు నిన్ను ఆదేశిస్తున్నాడు... ఏ గణతంత్రం గురించి నువ్వు శుష్కపాఠం చెబుతున్నావో ఆ గణతంత్రాధిపతి ఏపాపం ఎరుగని నిర్దోషురాలైన నారిని తన పాతివ్రత్యాన్ని, తన సతీత్వాన్ని నిరూపించమన్నాడు... చెప్పు అక్రూరా... ఇతనితో చెప్పు... నాశ్వాస ఆగిపోకముందు నేను ఒక్కసారి ఆ క్షణాన్ని గుర్తుకు తెచ్చుకొంటాను...'' తూర్పుదిశగ మగధ, చేది, పౌండ్ర వంటి సామ్రాజ్యాలతో ఇంకా ఉత్తర పశ్చిమదిశగా ఉన్న హస్తినాపురం వంటి బలమైన రాజ్యాలతో.... ఈ విధంగా మూడు వైపులా చుట్టబడి ఉన్న వ్రజభూమిపైన యాదవ గణతంత్రం ఏకాధిపత్యం బదులుగా బహుజన హితాయ, బహుజన సుఖాయ' అన్నట్లుగా ప్రకాశించింది. అంధక వృష్ణికులం వంటి ఆగ్ర సామ్రాజ్యాల మధ్య ఉండి కూడా ఈ భూమిఖండం యొక్క గణతంత్రం యొక్క ఉజ్వల పరంపరను రక్షిస్తూ వచ్చాను. ఇతర రాజ్యాలలో గణతంత్రం యొక్క ఆర్య పరంపర చాలా వరకు నిష్ఫలం అయిపోయింది. ఆర్యకులస్థులు తమతమ సామ్రాట్టులను స్వీకరించారు. ప్రజలు కూడా ఈ సామ్రాట్టులకు జయ జయకారం చేయటంలోనే తమ లాభం ఉంది అనుకొన్నారు. ఒక్క వ్రజభూమి, మరియు యాదవ పరివారం వారే తమ పారంపరిక సంస్కృతి మూల్యాలను కాపాడుతూ వచ్చారు. అక్కడ ఎవరో ఒక వ్యక్తికి జయజయ కారాలు చేయటం జరగలేదు. శాసకుని పట్ల నమ్మకం చూపారు. భయం కాదు.

మధురలో దక్షిణాన ఉన్న సుయామున పర్వతం ప్రక్కన ఉన్న పచ్చని

లతానికుంజములు ఉన్న ప్రదేశము ఆర్య ఉగ్రసేనుడు అతని పత్ని పవనరేఖలకు అత్యంత రమణీయ విహారస్థలము. రాజ్య వ్యవహారాలనుండి ఏమాత్రం అవకాశం దొరికినా ఉగ్రసేనుడు పవనరేఖతో సుయామున పర్వతపు వనాంతర సీమలలో లతామండపాలమధ్య ఏకాంతం కోసం, శాంతి కోసం వెళ్ళేవారు.

ఆరోజున కూడా ఆ పతిపత్నులు ఆ ప్రకృతిధామానికి వెళ్దామని అనుకొన్నారు. కాని ఇంతలోనే ఆర్య ఉగ్రసేనుడు అత్యంత మహత్వ పూర్ణమైన కార్యంకోసం ఆగిపోవాల్సి వచ్చింది. పవనరేఖ నిరాశ చెందింది.

"ప్రియా! నువ్వు నిరుత్సాహ పడవద్దు" ఉగ్రసేనుడు పవనరేఖను నిరాశపరచటం అనేది ఊహించనుకూడాలేడు. "నువ్వు నీ సఖులతో కలిసి ముందు వెళ్ళు. ఎక్కడికి అంటే నీకు ప్రియమైన ఆ ప్రదేశానికి. అవసరమైన రాచకార్యాలు ముగించుకొని నీ వెనకే నేనూ వచ్చేస్తాను" అని సముదాయించాడు. పవనరేఖ సంతోషించింది. అక్కడకు ముందు తను వెళ్ళి తన పతికోసం ప్రతీక్ష చేస్తుంది. ఆ ప్రతీక్షలో ఎంత ఆనందం ఉంది? తను కొందరు చెలికత్తెలను వెంటపెట్టుకొని సుయామున పర్వత ప్రాంతాలకు చేరుకొంది. తనకు ఇష్టమైన ప్రదేశం ప్రక్కన ఒక సెలయేరు పారుతూ ఉంటుంది. ఆ సెలయేరులోని నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. పవనరేఖ ఆమె సఖులు ఆ సుందరధామంలో మైమరచి పోయారు. ఉగ్రసేన మహారాజు వచ్చేలోపల జలక్రీడలలాడటానికి వారు ఆ జలాశయంలోకి దిగారు. తమ తనువులను మనస్సులను మరచి చేస్తున్న జల విహారాలు కేరింతలలో, వారు పరిసరాలనే మరిచారు. ఒకళ్ళమీద ఒకళ్ళు నీళ్ళు చల్లుకుంటున్నారు.

జలక్రీడలు సలుపుతున్న ఆ అమాయక స్త్రీలకు శోభ దేశపురాజు దుర్మిలుడు అక్కడ దాగి ఉండి తమ అందాలను తిలకిస్తున్నాడని తెలియదు.

దుర్మిలుడు సామ్రాట్టు కాదు. ఆర్యావర్తంలో గుర్తింపు పొందదగిన కీర్తి ప్రతిష్ఠలు, సంపత్తి అతనివద్ద లేవు. అతడు శోభనగరం భూమి ఖండాన్ని పాలించేవాడు. సామ్రాజ్యాల జయ ఘోషలలో దుర్మిలుడి గురించి శోభానగరం గురించి ఎవరూ పట్టించుకున్నవారు లేరు. దుర్మిలుడికి కూడా సరిహద్దులను విస్తరించాలన్న కోరిక ఏ మాత్రం లేదు. తను ప్రశాంతంగా ఉంటూ తన దిన చర్యలో సాధన చేసి ఒక అద్భుత విద్యను సంపాదించాడు. దానివల్ల అతడు కామరూప ధారణ చేయగలడు. ఏ రూపం కావాలంటే ఆ రూపాన్ని

ధరించగలడు. అటువంటి సామర్థ్యం ప్రాప్తించిన తరువాత మానవుడు ఆ శక్తుల ఆంక్షలతో పీడితుడౌతాడు. వాటి నుంచి ముక్తుడు కావటం దుర్లభం. కాని సద్భాగ్యం వల్ల దుర్మిలుడు అంతవరకు వాటికి లోబడక దూరంగా ఉండగలిగాడు.

ఈ రోజు అతడు విహారం చేస్తూ అనుకోకుండా అక్కడికి వచ్చాడు. అతడు అచటి ప్రకృతి సౌందర్యాన్ని కళ్ళతో పానం చేయటంలో నిమగ్నుడై ఉండగా ఉన్నట్లుండి అతని దృష్టి అక్కడ స్నానం చేస్తున్న సుందరిపైన పడింది. ఇంత సౌందర్యమా! ఇంత ఆకర్షణా! ఇంతకు పూర్వం ఎన్నడూ చూడని అందాలను అతడు చూశాడు. అతని మనస్సు చాలా కలవర పడింది. ఆమె పొందుకోసం అతని మనస్సు తహతహలాడింది. నిర్మల ప్రకృతి వదనంపైన ఒక నల్లటి గీత పడింది.... దుర్మిలుడు ఆ సుడిగుండంలో చిక్కుకొన్నాడు.
"మహరాజ్!" ఒక అనుచరుడి పిలుపుతో అతడు ఉలిక్కిపడి సామాన్య స్థితికి వచ్చాడు. "మధుర గణతంత్రానికి అధ్యక్షుడైన ఆర్య ఉగ్రసేనుడు కొద్దిసేపటిలో ఇక్కడికి వస్తున్నట్లు దూత వార్త తెచ్చాడు ప్రభూ."
ఉగ్రసేనుడా?.... ఇక్కడా? ఇప్పుడా? దుర్మిలుడు ఆ మాటలు అంటున్నాడేగాని అతని కన్నులు మటుకు ఆమె సుందరమైన దేహాన్నే తిలకిస్తున్నాయి... ఇక ఉగ్రసేనుడి ఆగమన వార్త అతని మనస్సుకు ఎక్కడ పడుతుంది! ఆ తరువాత అనుచరుడు 'అటువైపు ఏదో జలాశయం దగ్గర ఉగ్రసేనుని పత్ని పవనరేఖ లతామండపంలో అతని ఆగమనం కోసం ప్రతీక్షిస్తున్నది అని తెలిసింది' అన్న వార్త వినిపించాడు.

ఆ దొరికింది...... దుర్మిలుడికి ఆమె ఎవరో తెలిసింది. ఆ స్నిగ్ధ సుందరి నామం అతను తెలుసుకొన్నాడు. అరె... ఈమేనా ఆర్య ఉగ్రసేనుడి అందాల భార్య పవనరేఖ!.... అనుకొన్నాడు. అనుచరుడు సందేశం తెస్తుంటే, వీడొకడు మధ్యలో పానకంలో పుడక లాగా అనిమొదట విసుగుగా అనిపించినా అతని వల్ల తాను చూస్తున్న సుందరి పరిచయంతెలియగానే దుర్మిలుడికి ఎక్కడ లేని సంతోషం కలిగింది. -సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,